teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 402 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 15 జూన్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## గ్రూప్-2 అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్

### దరఖాస్తులో పొరపాట్లు ఉంటే సరిదిద్దుకునే ఛాన్స్

### ప్రకటన విడుదల చేసిన పబ్లిక్ సర్వీస్ కమిషన్




హైదరాబాద్, జూన్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణ గ్రూప్-2 అభ్యర్థులకు సంబంధించి పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక ప్రకటన చేసింది. పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆ దరఖాస్తులో ఏమైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకునే ఛాన్స్ ఇచ్చింది. గ్రూప్ 2 అభ్యర్థులకు దరఖాస్తు

మిగతా 2 లో

## ఓటర్ల జాబితా ఆధారంగా బీసీల

# రిజర్వేషన్ సర్వే





### సర్వే లెక్కల ప్రకారం రిజర్వేషన్లపై కసరత్తు

### ప్రక్రియ పూర్తికి రెండు మూడు నెలలు పట్టవచ్చని అంచనా

### సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పాటించనున్న మూడు అంశాలు


**రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకుగాను బీసీల రిజర్వేషన్‌ను ఖరారు చేసేందుకు ఓటర్ల జాబితా ఆధారంగా సర్వే నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ సర్వేలో తేలిన లెక్కల ప్రకారం రిజర్వేషన్లపై కసరత్తు చేయాలని భావిస్తోంది.**

తెలంగాణ బ్యూరో, జూన్ 14 (తీన్మార్ న్యూస్): వాస్తవానికి రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీల లెక్కలు తేల్చాక అందుకనుగుణంగా వారికి రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ, కులగణనకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండడం, మరోవైపు స్థానిక ఎన్నికలనూ రాజ్యాంగబద్ధంగా ఐదేళ్లకోసారి నిర్వహించాల్సి ఉండడంతో ప్రభుత్వం ఓటర్ల జాబితా ఆధారిత సర్వే వైపు మొగ్గు చూపిస్తోంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి తాజా ఓటర్ల జాబితాను తీసుకుని, ఆ జాబితాతో సిబ్బందిని గ్రామపంచాయతీల వారీగా ఇంటింటికీ పంపి కులాలవారీ లెక్కలు సేకరిస్తారు. గ్రామాల వారీగా ఏ కులం జనాభా ఎంత ఉందో తేలుస్తారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని రెండు



## ఇందిరమ్మ ఇండ్ల పంపిణీకి కసరత్తు

### ప్రక్రియను వేగవంతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు



తెలంగాణ బ్యూరో, జూన్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో మరో పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇన్నాళ్లూ ఎన్నికల కోడ్ కారణంగా ముందు కదలని ప్రక్రియను ఇప్పుడు వేగవంతం చేసి ప్రజల కళ్లల్లో సంతోషాన్ని నింపాలని భావిస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో పేదలకు ఇల్లు ఒకటి. ఇప్పటికే ప్రజాపాలన పేరుతో అర్హుల నుంచి అప్లికేషన్లు

మిగతా 2 లో




## శాఖలవారీగా బడ్జెట్ సన్నాహక సమావేశాలు

### వరుస సమావేశాలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

హైదరాబాద్, జూన్ 14 (తీన్మార్ న్యూస్): శాఖలవారీగా బడ్జెట్ సన్నాహక సమావేశాలకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఓడీలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ కానున్నారు. ఈ నెల 18న వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేతశాఖల ప్రతిపాదనలపై చర్చించనున్నారు. 21న రెవెన్యూ, గృహనిర్మాణం, ఐఅండ్‌పీఆర్, పంచాయతీరాజ్, మహిళా

మిగతా 2 లో



## ఎమ్మెల్సీ కవితకు కలిసిన కేటీఆర్

న్యూ ఢిల్లీ, జూన్ 14 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తీహార్ జైలులో వున్న ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. శుక్రవారం కవితను మర్యాదపూర్వకంగా కలిసారు. అలాగే కవిత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆమెను కలిసిన అనంతరం కేటీఆర్ హైదరాబాద్‌కు తిరుగు పయనం అయ్యారు. కాగా, ఇటీవల కవితకు ఢిల్లీలోని రూస్ అవెన్యూ కోర్టు జ్యుడీషియల్ రిమాండ్‌ను మరో రెండు వారాల పాటు పొడిగించిన సంగతి

మిగతా 2 లో

## తెలంగాణ ప్రారంభంకానున్న బోనాల పండుగ

### రాష్ట్ర పోర్టల్ క్యాలెండర్ ప్రకారం జూలై 27న బోనాల సెలవుదినం



హైదరాబాద్, జూన్ 14 (తీన్మార్ న్యూస్): ఆషాఢ మాసంలో వచ్చే తెలంగాణ పెద్ద పండుగ బోనాలు. 2024 జూలై 7వ తేదీన గోల్కొండ కోటలోని జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించనున్నారు భక్తులు. ఈ క్రమంలో రాష్ట్ర పండుగా ఆ రోజున సెలవు ప్రకటించే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్ర పోర్టల్ క్యాలెండర్ 2024 ప్రకారం జూలై 27న శనివారం రోజున బోనాలు సెలవుదినం ఉంది. హిందూ క్యాలెండర్ ప్రకారం మహంకాళి దేవిని జరుపుకునే ఆషాడ మాసంతో బోనాలు ప్రారంభమవుతాయి. హైదరాబాదు,

మిగతా 2 లో



## పనికిరాని కాళేశ్వరం ప్రాజెక్టును కట్టడంతో 7లక్షల కోట్ల అప్పులు

**పేద బిడ్డల చదువును పట్టించుకోలేదు**

**గత ప్రభుత్వంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు**

నల్గొండ, జూన్ 14 (తీన్మార్ న్యూస్): కేసీఆర్ పనికిరాని కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి ఏడు లక్షల కోట్ల అప్పులు చేశారని, పేద బిడ్డల చదువును పట్టించుకోలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యను అందించడమే

మిగతా 2 లో

## సీనియారిటీ ప్రాతిపాదికనే ప్రమోషన్ల ఎంపిక

**ప్రభుత్వం నిషేధం ఎత్తివేస్తేనే బదిలీలు**

**ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు**

**సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి వెల్లడి**



తెలంగాణ బ్యూరో, జూన్ 14 (తీన్మార్ న్యూస్): ప్రిన్సిపాల్స్ సెలక్షన్స్‌లో ఇప్పటివరకు అమలు చేస్తున్న ఇంటర్వ్యూ విధానాన్ని రద్దు చేస్తామని, సీనియారిటీ ప్రాతిపాదికనే ఎంపిక చేస్తామని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి వెల్లడించారు. కోర్టుకు వెళ్లినవారికి ఎలాంటి


మిగతా 2 లో

## డీఎస్సీ అర్హత కోల్పోయిన అభ్యర్థులకు గుడ్ న్యూస్

### డిగ్రీ పాసైతే దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్న ప్రభుత్వం

తెలంగాణ బ్యూరో, జూన్ 14 (తీన్మార్ న్యూస్): డిగ్రీలో మార్కులు తక్కువ వచ్చిన కారణంగా డీఎస్సీ రాసేందుకు అర్హత కోల్పోయిన అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం ఓ గుడ్ న్యూస్ చెప్పింది. 2011కు ముందు డిగ్రీ పాసైన అభ్యర్థులు

మిగతా 2 లో



## రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి కావలెను..!

### ట్విట్టర్ వేదికగా టీబీజేపీ సెటైర్లు

### విద్యా వ్యవస్థపై సరైన పర్యవేక్షణ లేదని ఫైర్

తెలంగాణ బ్యూరో, జూన్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను ప్రస్తావిస్తూ టీబీజేపీ ట్విట్టర్ వేదికగా సెటైర్లు వేసింది. పాఠశాలలు మొదలైన విద్యాశాఖ మంత్రి పత్తాలేదని ఫైర్ అయింది. సరైన పర్యవేక్షణ లేక ఉద్యోగాలు భర్తీలు కాక, ప్రాథమిక విద్యాశాఖ కుదేలవడంతో

మిగతా 2 లో




## నీట్ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు పిటిషన్‌పై విచారణ

### ఎన్టీఏతో పాటు సీబీఐ, కేంద్ర, బిహార్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ

### ఈ పిటిషన్ పై రెండువారాల్లో స్పందన కోరిన సుప్రీంకోర్టు

న్యూ ఢిల్లీ, జూన్ 14 (తీన్మార్ న్యూస్): నీట్-యూజీసీ 2024 పరీక్షలో అక్రమాల ఆరోపణల వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నీట్ పరీక్షలో అక్రమాల ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ పై శుక్రవారం

మిగతా 2 లో






## వెంకట్రామిరెడ్డిని వదిలి పెట్టే ప్రసక్తే లేదు

**100 కోట్లు ఎలా సంపాదించాడో చెప్పాలని డిమాండ్**

**వెంకట్రామిరెడ్డిపై రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు**

.. వివరాలు 2లో

# శాఖలవారీగా బడ్జెట్ సన్నాహక సమావేశాలు

**మొదటి పేజీ తరువాయి**

శిశు సంక్షేమం, వైద్యారోగ్యశాఖ, ఈ నెల 22న ఆర్అండ్‌బీ, సినిమాటోగ్రఫీ, ఐటీ, పరిశ్రమల శాఖపై చర్చించనున్నారు. ఇక ఈ నెల 26న నీటిపారుదల, పౌరసరఫరాలు, అటవీ, దేవాదాయశాఖ, 27న రవాణా, బీసీ సంక్షేమం, ఎక్సైజ్, పర్యాటకశాఖల ప్రతిపాదనలపై సమీక్షించనున్నారు. ఈ నెల 28 నుంచి జులై 1 వరకు సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ఉన్న శాఖలపై చర్చించనున్నారు.

# ఎమ్మెల్సీ కవితకు కలిసిన కేటీఆర్

**మొదటి పేజీ తరువాయి**

తెలిసిందే. ఢిల్లీ లిక్కర్ సీబీఐ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ కవిత సీబీఐ జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు మరో సారి పొడిగించిన విషయం తెలిసిందే. కాగా సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ న్యాయస్థానం అంగీకరించింది. ఈ మేరకు సీబీఐ కేసులో ఈ నెల 21 వరకు కవిత జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. మరోవైపు కవిత చదువుకోవడానికి కొత్తగా తొమ్మిది పుస్తకాలు కావాలని కోర్టును కోరింది. ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తిని రౌస్ రెవిన్యూ కోర్టు అంగీకరించింది. తదుపరి విచారణను జూన్ 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. అదే రోజు సీబీఐ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై రౌజ్ అవెన్యూ కోర్టు విచారణ జరపనుంది.

# తెలంగాణ ప్రారంభంకానున్న బోనాల పండుగ

**మొదటి పేజీ తరువాయి**

తెలంగాణలోని ఇతర ప్రాంతాలలో, భక్తులు, ముఖ్యంగా మహిళలు బోనాలు జరుపుకోవడానికి ప్రత్యేకంగా అలంకరించిన కుండలలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారు. జూలై 7వ తేదీ ఆదివారం – గోల్గొండ జగదాంబికకు తొలిబోనం సమర్పించడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. జూలై 11 గురువారం – రెండవ పూజ, జూలై 14 ఆదివారం – మూడవ పూజ కాగా.. జూలై 18 గురువారం – నాల్గవ పూజ నిర్వహిస్తారు. జూలై 21 ఆదివారం – ఐదవ పూజ, జూలై 25 గురువారం – ఆరోపూజ, జూలై 28 ఆదివారం – ఏడవ పూజ కాగా.. ఆగస్ట్ 1 గురువారం – ఎనిమిదవ పూజ అనంతరం ఆగస్టు 4 ఆదివారం – తొమ్మిదవ పూజ చేస్తారు. అంటే జూలై 7వ తేదీ ఆదివారం ప్రారంభమయ్యే బోనాలు ఆగస్టు 4వ తేదీ ఆదివారంతో ముగుస్తాయి. హైదరాబాద్‌లో నెలరోజుల పాటు బోనాల పండుగను మూడు దశల్లో నిర్వహిస్తారు. గోల్కొండ బోనాలు అనంతరం సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో లష్కర్ బోనాలు నిర్వహిస్తారు. పాతబస్తీలోని లాల్ దర్వాజాలోని శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయంలో, హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయి. 150 సంవత్సరాల క్రితం పెద్ద కలరా వ్యాప్తి రావడంతో ఈ తరువాత ఈ పండుగను మొదటిసారి జరుపుకున్నారని భక్తుల నమ్మకం. మహంకాళి కోపం కారణంగానే ఈ మహమ్మారి వచ్చిందని ప్రజలు నమ్మి ఆమెను శాంతింపజేయడానికి బోనాలు సమర్పించడం ప్రారంభించారు. ఆ తరువాత ఇదే సాంప్రదాయంగా వస్తుంది. తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్ర పండగగా ప్రకటించి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.

# పనికిరాని కాళేశ్వరం ప్రాజెక్టును కట్టడంతో 7లక్షల కోట్ల అప్పులు

**మొదటి పేజీ తరువాయి**

లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన నల్గొండ జిల్లా నార్కట్ పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం బ్రాహ్మణుల ప్రాజెక్టుని పరిశీలించారు. వచ్చే మూడు నెలల్లో సీఎం రేవంత్ రెడ్డిని తీసుకొచ్చి ప్రాజెక్టు ప్రారంభిస్తానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మెగా డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నామని చెప్పారు. విద్యారంగానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు.

# సీనియారిటీ ప్రాతిపాదికనే ప్రమోషన్ల ఎంపిక

**మొదటి పేజీ తరువాయి**

ప్రమోషన్లు, బదిలీలు ఉండబోవని స్పష్టం చేశారు. 317 జీవో అమలు, బదిలీలు, ప్రమోషన్లు, నూతనంగా సొసైటీకి ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వడంపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఆమె చర్చించి, పలు అంశాలపై స్పష్టతనిచ్చారు. ప్రిన్సిపాల్ సెలక్షన్స్‌లో ఇంటర్వ్యూలను రద్దు చేస్తామని వెల్లడించారు. అన్ని క్యాడర్లకు సంబంధించి సీనియర్ జాబితాలను 18వ తేదీలోగా 317 జీవో ప్రకారం ఫైనల్ చేస్తామని వివరించారు. వివిధ అంశాలపై 88 మంది ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లారని, వాటిపై స్టేటస్‌కో అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రస్తుత ప్రమోషన్లు, బదిలీల్లో సదరు ఉద్యోగులు, ఉపాధ్యాయులను పరిగణనలోకి తీసుకోబోమని, ప్రస్తుతం ఉన్న ప్రదేశం, జోన్‌లో మాత్రమే వారు యథావిధిగా కొనసాగుతారని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిషేధం ఎత్తివేస్తేనే బదిలీలు ఉంటాయని, లేదంటే ప్రమోషన్లు మాత్రమే కల్పిస్తామని తేల్చిచెప్పారు. 317 జీవో అమలు, పోస్టింగ్స్, ప్రమోషన్స్, సాధారణ బదిలీల సందర్భంగా సీవోఈ పాఠశాలలు, కళాశాలల్లోని అన్ని పోస్టులతో ఖాళీలను వెల్లడిస్తామని, ఏ పోస్టు కూడా బ్లాక్ చేయబోమని చెప్పారు. ప్రమోషన్స్, పోస్టింగ్స్ అన్నీ వెబ్ కౌన్సెలింగ్ ద్వారానే నిర్వహిస్తామని తెలిపారు.

**20 నుంచి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్**

ఇటీవల ట్రిబ్ ద్వారా సోషల్ వెల్ఫేర్ సొసైటీకి ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 20 నుంచి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ప్రారంభించనున్నట్టు సొసైటీ సెక్రటరీ సీతాలక్ష్మి వెల్లడించారు. జూలై 1 నాటికి ఉత్తర్వులు ఇచ్చే ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. అప్పటిలోగా 317 జీవో అమలు, ప్రమోషన్స్, బదిలీలన్నీ పూర్తి చేస్తామని తెలిపారు. నూతనంగా రెగ్యులర్ అయిన కాంట్రాక్ట్ టీచర్లకు కూడా 317 జీవో ప్రకారం వెబ్ కౌన్సెలింగ్ ద్వారా కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు.

# నీట్ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు పిటిషన్ పై విచారణ

**మొదటి పేజీ తరువాయి**

సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషన్ తరపు వాదనలు విన్న న్యాయస్థానం ఈ పిటిషన్ పై రెండువారాల్లో తమ స్పందన తెలియజేయాలని కేంద్రం, ఎన్టీఏతో పాటు సీబీఐ, బిహార్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ సందర్భంగా పటిషనర్ తరపున వాదనలు వినిపించిన ఓ న్యాయవాది రాజస్థాన్ లోని కోటా నగరంలో విద్యార్థుల ఆత్మహత్యల అంశాన్ని ప్రస్తావించగా దీనిపై సర్వోన్నత న్యాయస్థానం అభ్యంతరం వ్యక్తం చేంది. కోటాలో ఆత్మహత్యలకు నీట్ యూజీ 2024 ఫలితాలతో సంబంధం లేదని అనవసర భావోద్వేగ వాదనలు ఇక్కడ చేయవద్దనంటూ సున్నితంగా మందలించింది. అనంతరం తదుపరి విచారణ జూలై 8కి వాయిదా వేసింది. నీట్ పరీక్షకు సంబంధించి దాఖలైన ఇతర పెండింగ్ పిటిషన్లతో కలిపి దీన్ని విచారిస్తామని స్పష్టం చేసింది.

# రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి కావలెను..!

**మొదటి పేజీ తరువాయి**

సామాన్య ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. కాంగ్రెస్ పాలనకు ఇదే అద్దం పడుతోందని మండిపడింది. ఈ ట్వీట్‌కు తెలంగాణకు విద్యాశాఖ మంత్రి కావలెను అనే ఫొటోను జత చేసింది. విద్యాశాఖ మంత్రి పోస్ట్, 26 జిల్లాలకు డీఈవో పోస్టులు, డిప్యూటీ ఈవో పోస్టులు, 598 ఎంఈవో పోస్టులు, 22000 టీచర్ పోస్టులు, స్కేవెంజేర్ పోస్టులు గాడిద గుడ్డు అయ్యాయని సెటైర్లు వేసింది.

# ఓటర్ల జాబితా ఆధారంగా బీసీల "రిజర్వేషన్" సర్వే

**మొదటి పేజీ తరువాయి**

మూడు నెలల్లోనే పూర్తిచేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అప్పుడు సెప్టెంబరులో ఎన్నికలు నిర్వహించే వీలుంటుంది. అయితే ప్రస్తుతానికి ఎన్నికల కోసం ఓటర్ల జాబితా ప్రకారం కులాల లెక్కలు తీసినా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీమేరకు సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ కుల సర్వేను విడిగా నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వం కూడా ఇదే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, సుప్రీంకోర్టు 2010లో ఇచ్చిన తీర్పు ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కోసం తేల్చాల్సిన కులాల లెక్కల్లో మూడు అంశాలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. డెడికెటేడ్ కమిషన్ ఏర్పాటు చేయడం, ప్రతి గ్రామం వారీగా కులాల లెక్కలు తీయడం, అన్ని వర్గాలకు కలిపి 50 శాతానికి మించకుండా రిజర్వేషన్ ఉండడం అన్నవి ఈ మూడు అంశాలు. అయితే ఓటర్ల జాబితా ప్రకారం ముందుకెళ్లినా ఈ మూడు అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్టే అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఓటర్ల జాబితా ప్రకారం కులాల లెక్కల తీస్తే అన్ని కులాలతోపాటు బీసీల లెక్కలూ తేలుతాయి. దానిని బట్టి వారికి ఎంతశాతం రిజర్వేషన్ కల్పించాలనే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే గత బీఆర్ఎస్ సర్కారు 2018లో పంచాయతీరాజ్ చట్టంలో పలు సవరణలు చేసింది. అందులో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా చూసే క్రమంలో బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 23 శాతానికి తగ్గించింది. ఆ విధానంలోనే 2019లో స్థానిక ఎన్నికలు నిర్వహించింది. అయితే బీసీలకు రిజర్వేషన్లు తగ్గించి ఎన్నికలు నిర్వహించడంపై హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. హైకోర్టు వాటిని విచారించిన సమయంలో 2024లో జరిగే స్థానిక ఎన్నికల్లో సుప్రీం మార్గదర్శకాలను అమలు చేస్తామని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం న్యాయస్థానానికి చెప్పింది. దీంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. అందుకోసం రాష్ట్రంలోని బీసీల జనాభాను తేల్చి వారి శాతాన్ని ఖరారు చేయాల్సి ఉంటుంది.




**రిజర్వేషన్ల అంశంతో ఆలస్యం అవుతున్న ఎన్నికలు**

నిజానికి సర్పంచ్‌ల పదవీకాలం ఈ జనవరిలోనే ముగిసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం జూలై మొదటివారంతో ముగియనుంది. దీంతో ఈలోపే ఎన్నికలు నిర్వహించి కొత్తవారిని ఎన్నుకోవాల్సి ఉంది. కానీ, రిజర్వేషన్ల అంశం తెరపైకి రావడంతో ఎన్నికలు సమయానుకూలంగా జరగడంలేదు. అయితే 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు.. బీసీ కార్పొరేషన్ ద్వారా సేకరించిన గణాంకాలు, 2000వ సంవత్సరంలో నాటి సీఎం చంద్రబాబునాయుడు నిర్వహించిన మల్టీపర్పస్ హౌస్‌హోల్డ్ సర్వే (ఎంపీహెచ్‌ఎస) ప్రకారం.

**ఓటర్ల జాబితాతో సర్వే ప్రక్రియ**

స్థానిక ఎన్నికలను కొత్త ఓటర్ల జాబితా ప్రకారం నిర్వహించాలంటే.. మొదట పంచాయతీరాజ్ శాఖ అధికారులు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి సవరించిన ఓటర్ల జాబితాను తీసుకోవాల్సి ఉంటుంది. ఆ జాబితా ఆధారంగా గ్రామ, వార్డు, మండలాల వారీగా ఉన్న కులాల వివరాలను సేకరిస్తారు. ఈ ప్రక్రియలో ఇతర కులాలతోపాటు బీసీలు ఎంతమంది ఉన్నారు, ఇప్పటివరకు ఎంతమేర రాజకీయ ప్రాతినిధ్యం లభించిందనే విషయంతోపాటు రాజకీయంగా ఎంతమేర వెనుకబాటుతనానికి గురయ్యారనే వివరాలను కూడా సేకరిస్తారు. ఈ వివరాలన్నింటినీ క్రోడీకరించి బీసీ కమిషన్‌కు సమర్పిస్తారు. బీసీ కమిషన్ వాటిని పరిశీలించి బీసీలకు ఎంతమేర రిజర్వేషన్ కల్పించాలనే దానిపై ప్రభుత్వానికి సూచన చేస్తుంది. అయితే.. కమిషన్ ఎంత శాతాన్ని సూచించినా.. ప్రభుత్వం మాత్రం 50శాతం రిజర్వేషన్ నిబంధనకు లోబడే నడచుకోవాల్సి ఉంటుంది.

**సర్వే అనంతరం రిజర్వేషన్లు మారే అవకాశం**

ఓటర్ల జాబితా ప్రకారం నిర్వహించబోయే ఎన్నికల్లో ఈసారి గ్రామాలు, వార్డుల వారీగా రిజర్వేషన్లు మారే అవకాశం ఉన్నట్టు కనిపిస్తోంది. వాస్తవానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో పంచాయతీరాజ్ చట్టంలో చేసిన సవరణల ప్రకారం.. ప్రతి పదేళ్లకోసారి మాత్రమే రిజర్వేషన్లు మారుతాయి. కానీ, గత ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్‌ల విషయంలో హైకోర్టులో పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం ఈ మార్పులు చేస్తోంది. బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్ రిజర్వేషన్లకు సంబంధించి కులసంఘాలు, నిపుణులు, ప్రొఫెసర్లతో వరుస సమావేశాలు నిర్వహిస్తోంది.

# ఇందిరమ్మ ఇండ్ల పంపిణికి కసరత్తు

**మొదటి పేజీ తరువాయి**

తీసుకున్నారు. ఇప్పుడు వాటి దుమ్ముదులిపే పనిలో పడ్డారు అధికారులు.



**ఇళ్ల కోసం 83 లక్షల దరఖాస్తులు**

ఇందిరమ్మ ఇళ్లు కావాలని అభ్యర్థిస్తూ 83 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని ఇప్పటి వరకు స్క్రూట్నీ చేయలేదు. ఇప్పుడు వాటిని వడపోసి అసలైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేస్తారు. ఓవైపు ఈ ప్రక్రియ సాగుతుండగానే మరో వైపు అసలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎలా ఉండాలనే అంశంపై అధ్యయనం ప్రారంబిస్తున్నారు.

**7740 కోట్లు కేటాయింపు**

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు డబుల్ బెడ్రూమ్ పేరుతో ఇళ్లు నిర్మించి ఇచ్చారు. ఇప్పుడు వాటి స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. తాత్కాలిక బడ్జెట్లో కూడా దీనికి నిధులు కేటాయించింది. ఈ పథకం కోసం 7740 కోట్లు కేటాయించారు. అంతే కాకుండా ఈ పథకాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి ఖమ్మంలో ప్రారంభించారు. ఈ పథకానికి హడ్కో వెయ్యికోట్ల రుణాన్ని కూడా మంజూరు చేసింది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు ముందుక సాగలేదు. ఇప్పుడు వాటిని జెట్స్పీడ్తో పూర్తి చేయాలని భావిస్తున్నరు.

## సరికొత్త మోడల్

వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్ల నమూనాలు పరిశీలించనున్నారు. ఆయా రాష్ట్రాల్లో లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణం, వాటి కోసం చెల్లిస్తున్న నిధులు అన్నింటిపై అధ్యయనం చేసి ఓ సరికొత్త మోడల్ను తయారు చేయనున్నారు. దాని ప్రకారం పథకాన్ని పూర్తి చేయాలని కాంగ్రెస్ సర్కారు భావిస్తోంది. దీని కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. ఏడాదికి నాలుగున్నర లక్షల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన. దానికి తగ్గట్టుగానే నిధులు కేటాయిస్తోంది. ఐదేళ్లలో ఇరవై లక్షలకుపైగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నది ప్లాన్. ఒక్కో నియోజకవర్గానికి ఒక ఏడాదిలో 3500 ఇళ్లు నిర్మించనున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తే వివాదాలు లేకుండా ప్రక్రియ పూర్తి చేయవచ్చనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను స్క్రూట్నీ చేసి లబ్ధిదారులను ఎంపిక, ఇటు ఇళ్లపై అధ్యయనం అన్నీ మూడు నెలల్లో పూర్తి చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నిశ్చయించింది ప్రభుత్వం.

# వెంకట్రామిరెడ్డిని వదిలి పెట్టే ప్రసక్తే లేదు

తెలంగాణ బ్యూరో, జూన్ 14 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ నేత వెంకట్రామిరెడ్డిపై మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డి ఎన్నికల్లో గెలిస్తే రూ.100 కోట్లు ఖర్చు చేస్తానని ప్రకించినట్లు గుర్తుచేశారు. అంత డబ్బు ఆయన ఎలా సంపాదించాడో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఖర్చు చేసిన డబ్బుల వివరాలు కూడా ప్రజలకు తెలియజెప్పాలని అన్నారు. వెంకట్రామిరెడ్డిని వదిలి పెట్టే ప్రసక్తే లేదని వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం బీజేపీ కార్యకర్తల కష్ట ఫలితమే బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాకపోవడానికి కారణం అన్నారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలం అయ్యాయని తెలిపారు. సుల్తానాబాద్‌లో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం అన్నారు. కాగా, పెద్దపెల్లి జిల్లాలో ఆరేళ్ల బాలికపై హత్యాచారం జరిగిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలోని మమతా రైస్ మిల్‌లో తల్లితోపాటు నిద్రిస్తున్న ఆరేండ్ల బాలికను అదే మిల్లులో డ్రైవర్‌గా పనిచేస్తున్న బలరాం అనే దుండగుడు సమీపంలోని పొదల్లోకి ఎత్తుకెళ్లి హత్యాచారం చేశాడు. ఉత్తరప్రదేశ్ చెందిన బలరాం అనే కూలీ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# డీఎస్సీ అర్హత కోల్పోయిన అభ్యర్థులకు గుడ్ న్యూస్

**మొదటి పేజీ తరువాయి**

మార్కులతో సంబంధం లేకుండా డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవచ్చని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమంలోనే డీఎస్సీ రాయాలంటే డిగ్రీల్లో ఉండాల్సిన కనీస మార్కుల శాతాన్ని ప్రభుత్వం తగ్గించింది. ఇక నుంచి జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 45 శాతం, ఇతరులకు 40 శాతం మార్కులు ఉంటే సరిపోతుందని పేర్కొంది. ఇప్పటి వరకు జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 50 శాతం, ఇతరులకు 45 శాతం మార్కుల నిబంధన ఉండేది. కాగా భాషా పండితులు, పీఈటీలకు ఈ కనీస మార్కుల నిబంధన వర్తించదు. వారు డిగ్రీ పాసైతే సరిపోతుంది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం జీవో నంబర్ 14ను విడుదల చేశారు. ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజీ పండిట్, పీఈటీ తదితర పోస్టుల మార్కుల శాతాన్ని తగ్గించారు. ఈనెల 20 వరకు డీఎస్సీ దరఖాస్తుకు అవకాశం ఉండడంతో తక్కువ మార్కులున్న అభ్యర్థులు అప్లై చేసుకునేందుకు అవకాశం వచ్చింది.

# గ్రూప్-2 అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్

**మొదటి పేజీ తరువాయి**

ఎడిట్‌కు ఆప్షన్ ఇచ్చింది. ఈ నెల 16 నుండి 20 వ తేదీ వరకు ఎడిట్ చేసుకునే అవకాశం కల్పించింది. ఈ నెల 16 న ఉదయం 10 గంటల నుంచి ఈ ఎడిట్ ఆప్షన్ అందుబాటులోకి రానుంది. చివరి తేదీ ఈ నెల 20 సాయంత్రం 5 గంటల వరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేర్కొంది. ఈ అవకాశం చివరిదని మరో అవకాశం ఉండబోదని వెల్లడించింది. అందువల్ల అభ్యర్థులు ఈ సమయంలో ప్రతి విషయాన్ని జాగ్రత్త చెక్ చేసుకోవాలని సూచించింది. ఈ అవకాశాన్ని వినియోగించుకునే అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఆధార్ కార్డుకు సంబంధించిన పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షను ఆగస్టు 7,8 తేదీలలో నిర్వహించనున్నట్లు ఇదివరకే ప్రకటించింది. మొత్తం గ్రూప్ 2 పరీక్షలో నాలుగు పేపర్లు ఉంటాయి.

# విడుదలైన టిజీ ఐసెట్ ఫలితాలు

తెలంగాణ బ్యూరో, జూన్ 14 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఐసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం హైదరాబాద్ ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ ఆర్ లింబాద్రి ఫలితాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీ వాకాణి కరుణ కూడా పాల్గొన్నారు. ఈ మేరకు ఐసెట్ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు https://icet.tsche.ac.in వెబ్ సైట్ ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పరీక్షకు 80 వేల మంది హాజరు కాగా వీరిలో 71,647 మంది పరీక్షలో క్వాలిఫై అయ్యారు. ఇందులో 33,928 మంది పురుషులు, 37,718 మంది మహిళలు, ఒక ట్రాన్స్ జెండర్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. 5543 మంది నాన్ లోకల్ కేటగిరిలో అర్హత సాధించినట్లు తెలిపారు. కాగా, జూన్ 5,6 తేదీల్లో ఐసెట్ పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. ఎంబీసీ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షల ప్రిలిమినరీ కీని ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది.

**ఫలితాలు ఇలా చెక్ చేసుకోవాలి**

ఐసెట్ ఫలితాలను తెలుసుకోవాలనుకునే వారు ముందుగా https://icet.tsche.ac.in వెబ్ సైట్‌లోని హెంపేజీలో ICET Results 2024 ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అనంతరం హాల్ టికెట్ నంబర్, డేట్ ఆఫ్ బర్త్ డీటెయిల్స్ ఎంటర్ చేయాలి. సబ్మిట్ చేసిన తర్వాత ర్యాంక్ కార్డు వస్తుంది. దీనిని ప్రింట్ లేదా డౌన్లోడ్ చేసుకోవచ్చు. అడ్మిషన్ సమయంలో ర్యాంకు కార్డు అవసరం అవుతుంది కాబట్టి ప్రింట్ తీసుకోవడం మంచిది. ఐసెట్ రెస్పాన్స్ షీట్లు


ఐసెట్ పరీక్ష రాసిన అభ్యర్థులు రెస్పాన్స్ షీట్లు డౌన్లోడ్ చేసుకోవడానికి https://icet.tsche.ac.in వెబ్ సైట్లోకి వెళ్లి హెూంపేజీలో చూస్తే Download Response Sheets అనే ఆప్షన్ కనిపిస్తుంది. దీనిపై క్లిక్ చేస్తే రిజిస్ట్రేషన్ నంబర్, హాల్ టికెట్ నెంబర్ ను అడుగుతుంది. వాటిని ఎంట్రీ చేసి సబ్మిట్ చేస్తే రెస్పాన్స్ షీట్స్ డౌన్లోడ్ చేసుకోవచ్చు.

# పాఠ్య పుస్తకం ముందుమాటలో తప్పులపై ప్రభుత్వం చర్యలు

## ముద్రణ సేవల డైరెక్టర్ శ్రీనివాసాచారిపై చర్యలు

## బాధ్యతల నుంచి శ్రీనివాసాచారి, రాధారెడ్డిలను తప్పించిన ప్రభుత్వం

హైదరాబాద్, జూన్ 14 (తీన్మార్ న్యూస్): పాఠ్యపుస్తకాల్లో ముందుమాటను మార్చకుండా విద్యాశాఖ ప్రింట్ చేయడం తెలంగాణ పాలిటిక్స్‌లో అగ్గి రాజేసింది. మాజీ సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిల పేర్లను ఉంచడంతో వివాదం మొదలైంది. ఇక, తాజాగా తెలుగు పాఠ్య పుస్తకం ముందుమాటలో తప్పులపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠ్యపుస్తక ముద్రణ సేవల డైరెక్టర్ శ్రీనివాసాచారిపై చర్యలు తీసుకుంది. ఎస్‌సీఈఆర్‌టీ అదనపు డైరెక్టర్ రాధారెడ్డిపై సైతం యాక్షన్స్ తీసుకుంది. పాఠ్య పుస్తకాల బాధ్యతల నుంచి శ్రీనివాసాచారి, రాధారెడ్డిలను తొలగించింది. ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్‌గా పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ రమేష్‌కు బాధ్యతలు అప్పగించింది. టీఆర్ఈఐఎస్ కార్యదర్శి రమణకుమార్‌కి ముద్రణ సేవల డైరెక్టర్ బాధ్యతలు అప్పగించింది.


...కృత్యాల ద్వారా అవగాహన కల్పించాలి. ఆలోచింపజేసే ప్రశ్నలు అడగాలి. ...
...జాతీయాలు, పదబంధాలు, ముఖ్యమైన సంకేతాత్మక వాక్యాలు, సంఘటనల గురించి లోతైన చర్చద్వారా అవగాహన, విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించాలి. భాషాసామర్థ్యాల సాధనలో పాఠ్యపుస్తకం ఉపాధ్యాయుడికి ఒక సహాయకారి మాత్రమే.
పాఠ్యపుస్తకంలోని భావనలను స్పష్టంగా, నిర్దిష్టంగా, ప్రభావవంతంగా అర్థం చేసుకోవడానికి వీలుగా ఈ పుస్తకాన్ని క్యూ.ఆర్. (క్విక్ రెస్పాన్స్) కోడ్‌లతో చేర్చి ఐలోపేతం చేయడం జరిగింది.
...ప్రోత్సహించిన తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారికి, విద్యాశాఖ పూర్వపు మంత్రులు శ్రీ జి. జగదీశ్ రెడ్డి గారికి, శ్రీ కడియం శ్రీహరి గారికి, ప్రస్తుత విద్యాశాఖా మంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గారికి, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి శ్రీమతి ... గారికి, పాఠశాల విద్యాశాఖ పూర్వపు సంచాలకులు శ్రీ ఎమ్. జగదీశ్వర్ గారికి, ప్రస్తుత సంచాలకులు శ్రీ ... గారికి, ప్రభుత్వ సలహాదారు డా॥ కె.వి.రమణాచారి గారికి ...
... ఉపాధ్యాయులు, చిత్రకారులకు ధన్యవాదాలు. ఈ వాచకాన్ని మరింత అందంగా ఆకర్షణీయంగా రూపొందించడానికి సాంకేతిక సహకారమందించిన, టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ బృందం, హైదరాబాద్ వారికి, శ్రీ రమేష్ ఖడే, కమ్యూనికేషన్ ఆఫీసర్, ... ముంబయి గార్లకు మరియు రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ వారిచే గుర్తించబడిన డిజైనర్లకు మా ప్రత్యేక ధన్యవాదములు.
ఈ వాచకం పిల్లల్లో భాషాభిరుచి, సాహిత్యాభిలాష, భాషాసామర్థ్యాలను పెంపొందించి ఉత్తమ వైఖరులు కలిగిన వ్యక్తులుగా ఎదగడానికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాం.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## ముందున్న సవాళ్లు అధిగమించేది ఎలా

303 సీట్లతో సొంతంగా మెజార్టీ ఉన్నప్పుడే..బీజేపీ సునాయాసంగా నిర్దేశిత లక్ష్యం 370 సీట్లు సాధించగలదన్న అంచనాలు వెలువడుతున్నప్పుడే?.మోదీ మరో కోణాన్ని ఆలోచించారు. అన్నీ ఉన్నాయన్న, వస్తాయన్న అతిశయానికి పోకుండా ఆచితూచి అడుగులు వేశారు. రాజకీయాల్లో మనం బలంగా ఉండడం ఎంత ముఖ్యమో?ప్రత్యర్థి బలహీనంగా ఉండడమూ, ఉంచడమూ అంతే ప్రధానమన్న సూత్రాన్ని ఒంటబట్టించుకుని వ్యూహాలు ఫలితంగా మూడోసారి దేశప్రధాని అయ్యారు. రచించారు. మూడో విడత ఢిల్లీ పీఠాన్ని అధిరోహించేక్రమంలో మోదీ ఒక్కో ఇటుకా పేర్చిన తీరు?..తలపండిన రాజకీయ విశ్లేషకుల అంచనాలను సైతం తలకిందులు చేసింది.ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశానికి మూడోసారి ప్రధాని అవ్వడానికి ఏకైక కారణం మోదీనే. దేశ ప్రధానిగా సాధించిన విజయాలే కాదు?అంచనాలకు అందని రీతిలో ఆయన వేసిన రాజకీయ అడుగులే?..ఆయన సరికొత్త చరిత్ర సృష్టించడానికి కారణమయ్యాయి. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవి చేపట్టింది మోదీనే. కానీ నెహ్రూ కాలంతో పోలిస్తే..ఇప్పటికి రాజకీయ వాతావరణం పూర్తి భిన్నం. నెహ్రూ, మోదీ సామాజిక నేపథ్యాలు, రాజకీయ అడుగులు కూడా భిన్నమైనవే. నెహ్రూ సంపన్న కుటుంబానికి చెందిన వారు.దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం ఘనత మొత్తం గంపగుత్తగా కాంగ్రెస్‌ఖాతాలో పడింది. ప్రతిపక్షం బలహీనంగా ఉంది. గాంధీజీ మరణం తర్వాత నెహ్రూ భారత రాజకీయ ముఖచిత్రంగా మారారు. అప్పటికి దేశంలో పార్టీ అంటే కాంగ్రెస్సే?రాజకీయ నేత అంటే కాంగ్రెస్ నాయకుడే. అలా పరిస్థితులన్నీ పూర్తిసానుకూలంగా ఉన్నప్పుడు నెహ్రూ వరుసగా ప్రధానిగా ఉన్నారు.కానీ మోదీ అలా కాదు. ఆయన ఓ సామాన్య కుటుంబం నుంచి వచ్చారు. చాయ్‌వాలాగా గుర్తింపు పొందారు. కూటమిగా అయినా ప్రతిపక్షం బలంగానే ఉంది. సంకీర్ణ రాజకీయాల కాలం నడుస్తోంది. అనేక రాష్ట్రాల్లో జాతీయపార్టీలు నామమాత్రమై?ప్రాంతీయపార్టీల హవా పెరిగిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో మోదీ దేశప్రధానిగా మూడోసారి ఎన్నికవ్వడం భారతదేశ చరిత్రలోనే కాదు..ఆధునిక ప్రపంచంలోనూ అతిపెద్ద విప్లవం.బీజేపీ కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చివేస్తుందని హెచ్చరిస్తూ కాంగ్రెస్ సహా ఇతర పక్షాలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. రిజర్వేషన్ల అమలుపై ఎన్నడూ లేనిస్థాయిలో చర్చ జరిగింది. అసలు మోదీ మరోసారి ప్రధాని అయితే..దేశంలో జరిగే చివరి ఎన్నికలు ఇవేననీ ప్రతిపక్షాలు జోస్యం చెప్పాయి.మరి ఇలాంటి విపరీత ప్రచారాన్ని సైతం దాటుకుని కొన్ని రాష్ట్రాలను బీజేపీ క్లీన్‌స్వీప్ ఎలా చేయగలిగింది..? జాతీయ స్థాయిలో వరుసగా రెండు సార్లు అధికారంలో ఉండి కూడా..కరోనా కల్లోలాన్ని తట్టుకుని కూడా బీజేపీ 240 సీట్లు ఎలా సాధించగలిగింది..? మోదీ గ్యారెంటీపై ప్రజలకు నమ్మకం కలగడానికి కారణమేంటి..? మోదీని ఇండియా ముఖచిత్రంగా ప్రపంచదేశాలు ఎందుకు చూస్తున్నాయి..?పదేళ్లు (2004–2014 మధ్య) అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమిపై అవినీతి, శాంతిభద్రతల నిర్వీర్యం వంటి ఆరోపణలతో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఆ భారీ వ్యతిరేకత తర్వాత అధికారంలోకి రావడం, ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజార్టీ ఉండడంతో 2014–2019 మధ్య మోదీ ప్రభుత్వ పాలన నల్లేరు మీద నడకలా సాగిపోయింది. 2019–2024 మధ్య మాత్రం భారీ మెజార్టీ ఉన్నప్పటికీ ప్రభుత్వానికి అనేక సవాళ్లు ఎదురయ్యాయి.ఆర్టికల్ 370 ఎత్తివేత, ట్రిబుల్ తలాక్ రద్దు వంటివి సాఫీగానే సాగినా?వ్యవసాయ చట్టాల అమలు, అం౦, కామన్ సివిల్ కోడ్ వంటి అమలు అనుకున్నంత తేలిగ్గా సాధ్యం కాలేదు. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చింది. అం౦ అమలును వాయిదా వేయాల్సివచ్చింది. కామన్ సివిల్ కోడ్ ఎన్నికలముందు మాత్రమే తెరపైకి వచ్చింది. వీటన్నింటికి తోడు కరోనా రూపంలో అసలైన సవాల్ ఎదురయింది. సంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాల్సివచ్చింది.కరోనాతో ఆర్థికాభివృద్ధిపై పెను ప్రభావం పడింది. ధరలు అదుపుతప్పాయి. రష్యా, యుక్రెయిన్ యుద్ధం వంటి అంతర్జాతీయ పరిణామాలు ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపాయి. అయితే ఈ సవాళ్లన్నింటినీ ప్రధాని మోదీ చాకచక్యంగా అధిగమించారు. సమయానుకూల నిర్ణయాలతో దేశం సంక్షోభం బారినపడకుండా నివారించారు. పొరుగుదేశాలు శ్రీలంక, పాకిస్థాన్‌కు ఎదురయిన దుస్థితి భారత్‌కు రాకుండా అడ్డుకున్నారు. మొదటిదఫాలో చేపట్టిన మేకిన్ ఇండియా వంటి ఫలితాలు ప్రభావం చూపాయి.మరోపక్క విదేశాంగవిధానంతో అంతర్జాతీయంగా భారత్‌ను బలీయంగా మార్చారు. పాకిస్థాన్ సైతం భారత్‌ను ప్రశంసించేస్థితిలోకి తీసుకెళ్లారు. సంస్కరణలున వేగవంతం చేసి సంపద సృష్టించారు. విశాలమైన రహదారుల నిర్మాణం, వందేభారత్ రైళ్లు, డిజిటల్ లావాదేవీలు, పారిశ్రామకరంగాలకు ప్రోత్సాహం వంటివాటితో ప్రజల జీవనవిధానంపై ప్రభావం చూపారు. ఫలితంగా కొత్త ఇండియా ఆవిర్భావానికి బాటలు వేశారు.అయితే పదేళ్లు వరుసగా అధికారంలో ఉండడంతో పాటు మతానికి ప్రాధాన్యత పెరిగిందన్న ఆరోపణలు, సంపద అందరికీ సమానంగా పంపిణీ కావడం లేదన్న విమర్శలు, ధరల పెరుగుదల, ప్రభుత్వరంగంలో ఉద్యోగాల కొరత, రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడ్డ ప్రభుత్వాల్లో జోక్యం చేసుకోవడం, అదేపనిగా జరిగిన సీబీఐ, ఐటీ దాడులు వంటివి ..బీజేపీపై ఊహించిన దానికన్నా వ్యతిరేకతను పెంచాయి.అవినీతి ఆరోపణలు ఉన్నవారిని పార్టీలో చేర్చుకోవడం, పాలన ఒకే చోట కేంద్రీకృతమ యిందన్న భావన వంటివి విమర్శకులకు పని కల్పించాయి. సొంతంగా 370 సీట్లు సాధించడమే లక్ష్యమని ఎన్నికల కురుక్షేత్రంలో దిగినప్పటికీ.. ఈ పరిస్థితులన్నింటినీ గమనించిన ప్రధాని మోదీ పొత్తుల విషయంలో ఎవరికీ అందని ఎత్తులు వేశారు. ఆయన వ్యూహాలతో ఒకే దెబ్బకు రెండు పిట్టలన్న చందంగా ఎన్డీఏ కూటమిని బలపడడంతో పాటు ఇండియా కూటమి బలహీనపడి మూడోసారి మోదీ దేశప్రధాని అయ్యేందుకు మార్గాన్ని సుగమం చేసింది.యూపీఏ కూటమి ఇండియాగా పేరు మార్చుకుని? అనేక పార్టీలను కలుపుకుపోయింది. ఆ కూటమి ఏర్పాటయినపుడు.. బలంగానే కనిపించింది. అయితే ఇండియా కూటమికి, ఎన్డీయే కూటమికి ఒకే ఒక తేడా ప్రధానిమోదీ. ఆ ఒక్క తేడానే బీజేపీని మరోసారి ఢిల్లీ పీఠంపై కూర్చోబెట్టింది.

# కబ్జాదారుల కబంధ హస్తాల్లో ప్రభుత్వ భూములు

- కన్నేస్తే కబ్జానే! ప్రభుత్వ భూములు స్వాహా
- మార్కెట్ భూములు, అసైన్డ్ భూములు, దేవుని భూములు, బంజారా భూములు, గ్రామకంఠం భూములు
- సర్కార్ భూమిపై కబ్జారాయుళ్ల కన్ను
- తెర వెనుక దాగున్నది ఎవరు..?
- వనపర్తి జిల్లా మదనాపురం లో పెరుగుతున్న భూకబ్జాలు
- ప్రభుత్వ బోర్డులు పెట్టినా ఆగని భూ అక్రమాలు
- పత్రాలు లేకపోయినా పైసలిస్తే చాలు
- అమాయక ప్రజలను మోసం చేస్తూ విక్రయాలు
- ప్రభుత్వ భూములకు రక్షణ కరువు
- ప్రభుత్వ భూములను కాపాడేది ఏవరు..?
- రూ.200 కోట్ల భూమిపై కబ్జాదారులు కన్ను
- 10 ఏండ్లు నుంచి నడుస్తున్నప్పటికీ నియంత్రించే అధికారులు కరువు
- జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలి







దేవరకద్ర ప్రతినిధి, జూన్ 14(తీన్మార్ న్యూస్):భూ బకాసురులు వనపర్తి జిల్లా, మదనాపురం, మండలం కేంద్రం మరియు వివిధ గ్రామాలలో కబ్జారాయుళ్ల రెచ్చిపోతున్నారు. కన్నేస్తే కబ్జానే!అంటున్నారు. ప్రభుత్వ భూములు ఖాళీ జాగగా (స్థలం) కన్పిస్తే పాగా వేసేస్తున్నారు. అధికారులకు ఆమ్యామ్యాలు ఎరజూపి రికార్డులు తారుమారు చేస్తున్నారు. కబ్జాదారుల భూదాహం వెరసి కోట్ల రూపాయల ప్రభుత్వ భూమి స్వాహా అవుతోందని మండల ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. రాజు తల్చుకుంటే దెబ్బలు కొదవ అన్న చందంగా ఉంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటె మాకేంటి...మా అధికారులు ఉంటె చాలు నాయకులు తలుచుకుంటే ప్రభుత్వ స్థలాలే ఉండవు అనే విధంగా ఉంది. ఈ అధికారుల తీరు.. ప్రస్తుత ప్రభుత్వంలోని అధికారుల తీరు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతో కబ్జా దారులు పెట్రేగి పోతున్నారన్నది జగమెరిగిన సత్యం ఓ వైపు కళ్లెదుటే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేస్తున్న భూ మాయాజాలాలు అంతా మాయల అనిపిస్తున్న ఇది మాయ కాదు..నిజమేనండోయ్ ఎక్కడో అనుకుంటున్నారా..! ఒక్కసారి వివరాల్లోకి వెళ్దాం..మదనాపురం మండలంలో ప్రభుత్వ భూములు, వ్యవసాయ మార్కెట్ భూములు, అసైన్డ్ భూములు, దేవుని భూములు, పోరంబోకు భూములు, బంజారా భూములు,గ్రామకంఠం భూములు మరియు వివిధ రకాల ప్రభుత్వ భూములపై కన్నేస్తే కతం భూముల విషయంలో అడిగి మమ్మల్ని ఇబ్బందుల్లో పెట్టొద్దని అంటున్నారు. మాకు చాలా ఒత్తిళ్లు, ఇబ్బందులున్నాయని రాజకీయంగా తాము ఇబ్బందులు పడాల్సి వస్తుంది.కంచె చేను మేస్తే నాకేంటి%ొ%లాగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఎక్కడ చూసిన ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. ఖాళీ స్థలం కనబడితే చాలు కబ్జా చేస్తున్నారు. అమాయక ప్రజలను మోసం చేస్తూ విక్రయిస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ తెలిసిన కూడా తెలియనట్లు వ్యవహరిస్తున్నారా అని ఆశ్చర్యపోతున్నారు. ముడుపులు తీసుకోవడంలో ఉన్న శ్రద్ధ వారి పనితీరుపై లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు బడా బాబులు నాయకులతో చేతులు కలిపి ఈ తంతు నడిపిస్తున్నారు. అనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. తెలిసినా తెలియనట్టు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు, ప్రభుత్వ భూమి కబ్జా అయిన విషయం తెలిసిన కూడా పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వ భూమి కబ్జా విషయంలో అన్ని తెలిసిన ఉన్నత అధికారులు స్పందించడం లేదంటే ఆంతర్యం ఏంటో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ కథనంపై అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా లోలోపల కప్పి పుచ్చుకుంటారా వేచి చూడాల్సిందేనని గ్రామ ప్రజల నుంచి వినిపిస్తున్న మాటలు. ప్రభుత్వ భూముల కబ్జాలు ఈ ఆరోవణలు ఇటీవల కాలంలో ప్రచారంలోకి వచ్చిన సందర్భాలు కావు. ఎప్పటి నుంచో నడుస్తున్నప్పటికీ నియంత్రించే అధికారులు లేకపోవడంతో కబ్జాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



### రెవెన్యూ అధికారుల పాత్ర ఏంటీ..?

తహసీల్దార్ అధికారులు,సిబ్బంది తమ పరిధిలోని భూ వివరాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలి. అంతే కాకుండా మండల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాల్లో ప్రభుత్వ ఆధీనంలోని భూములుంటే ఓ కన్నేసి ఉండాలి. ఆ భూములను కబ్జాలకు పాల్పడిన వారిపై రెవెన్యూ యాక్ట్? ప్రకారం కేసులు నమెదు చేయాలి. కానీ,ఆ భూమి కబ్జాకు గురవుతున్నా ఫిర్యాదులు చేయలేదనే భావనతో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కబ్జాదారులు సంబంధిత అధికారులను తాయిలాలతో నోర్లు మూయిస్తున్నారు. అప్పుడు స్థానికులు, స్వచ్ఛంద ప్రతినిధులు ఫిర్యాదులు చేసినా తమకేమీ సంబంధం లేదనే విధంగా అధికారులు పనిచేస్తున్నారు. అధికారుల పని తీరుతోనే కబ్జాదారులు ఖాళీ స్థలాలపై కన్నేసి కబ్జాలకు పాల్పడుతున్నారు. సుమారు రూ.200 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జాకు యత్నిస్తున్నారంటే ఎంతగా బరి తెగిస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం కబ్జాదారులకు పూర్తిస్థాయి సహకారం అందించినట్టే నేటి ప్రభుత్వం అక్రమార్కులకు సహకరిస్తుందా? అనే సందేహాలకు ఆజ్యం పోస్తుంది. స్థానికంగా అధికారులు మౌనంగా ఉండడం చూస్తుంటే అనుమానాలకు మరింత బలం చేకూరుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సింది పోయి కబ్జాదారులకు సహకరిస్తున్నారని అనుమానాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. మండలంలో జరుగుతున్న భూ కబ్జాలపై,అక్రమ నిర్మాణాల పై, కబ్జాదారులకి సహకరిస్తున్న అధికారుల వ్యవహారా తీరు ఇంకెన్ని బయటికి రానున్నాయి.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన
- జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జేండగే





భువనగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 14(తీన్మార్ న్యూస్): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జండగే వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం నాడు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులతో ఆయన సమావేశమై సీజనల్ వ్యాధుల ముందస్తు జాగ్రత్తలపై సమీక్షిస్తూ వర్షాకాలం మొదలైనందున అన్ని గ్రామాలలో నీటి నిలువలు ఏర్పడే అవకాశమున్నదని, దీనివలన దోమలు పెరిగి అనేక వ్యాధులకు కారణం అయ్యే అవకాశం ఉన్నందున దోమల నివారణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాలలో ఇంటి చుట్టుపక్కల నీటి గుంటలు లేకుండా చూడాలని తెలిపారు. గ్రామాలలో ఆశా, ఏ.ఎన్.ఎం లు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మండల అభివృద్ధి అధికారులు, వైద్యాధికార్లు సమన్వయముతో పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలల్లో శానిటేషన్ పై సిబ్బందికి అవగాహన కల్పించాలని,



గ్రామాలలో నీటి నిలువలు ఉన్న గుంటలలో ఆయిల్ బాల్స్ వేసి దోమలు పుట్టకుండా చూడాలన్నారు. డయేరియా రాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగేలా అవగాహన కలిగించాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాము కాటు, కుక్క కాటు తదితర జబ్బులకు కావలసిన మందులను నిలువ ఉంచుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. గత మూడు సంవత్సరాలలో ఏవైన గ్రామాలలో ప్రత్యేక ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే ఆ గ్రామాలపై నిఘా పెట్టాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఆశ్రమ పాఠశాల, పాఠశాలు సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వర్షాకాలంలో గర్భిణి స్త్రీలు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 20వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 01 నుంచి 19 వయస్సు వారికి ఆల్బెండైజర్ మాత్రలు వేయాలని, అందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, జిల్లాలో 1,57,496 మందికి పిల్లలకు ఈ మాత్రలు వేయాలని, 01 నుంచి 02 సంవత్సరాల మధ్య చిన్నారులకు సగం మాత్ర పొడిచేసి పాలు లేదా నీటిలో కలిపి తాగించాలి, 03 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర మింగించాలన్నారు. పిల్లలలో రక్తహీనత పోషకాహార లోపము నివారించడానికి ఇది దోహదపడుతుందన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. పాపా రావు మాట్లాడుతూ నీటి సంబంధిత వ్యాధులు, కీటక జనిత సంబంధిత వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అనుబంధ శాఖల సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాపిడ్ రెస్పాన్స్ టీమును ఏర్పాటు చేసి వారి మొబైల్ నెంబర్ ను ప్రతి గ్రామ పంచాయతి కార్యాలయంలో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. నులి పురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా పిల్లలందరికీ ఆల్బెండైజర్ మాత్ర గురించి పాఠశాలల్లో జరిగే ప్రార్ధన సమయంలో అవగాహన కల్పించాలని, అలాగే తల్లిదండ్రులతో సమావేశాల ద్వారా అవగాహన కల్పించి వంద శాతం మాత్రలు పిల్లలకు వేసేలా సంబంధిత శాఖలన్నీ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ కే. గంగాధర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.ఎ. కృష్ణన్, జిల్లా పంచాయతి అధికారి సునంద, ఉప జిల్లా వైద్యాధికార్లు డా. శిల్పిని, డా.యశోద, ప్రోగ్రాం అధికారులు డా. రామకృష్ణ, డా. సుమన్ కళ్యాణ్, డా. వంశీ, ఎంపిడిఓ లు వైద్యాధికారులు, మండల అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

# ఆహార పదార్థాల తయారీలో నాణ్యత పాటించాలి

### కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి

కోరుట్ల: ఆహారం పదార్థాల తయారీలో జాగ్రత్తలు పాటించి, వినియోగదారులకు సురక్షితమైన ఆహారం అందించాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు.. పట్టణంలోని రెస్టారెంట్లు,స్వీట్ హోమ్ లు, బేకరీలు, హోటల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రత పాటించని, మరియు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడే యజమానులకు జరిమానాలు విధించారు.. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఎక్కువ మంది ప్రజలు స్వీట్ వెండర్స్ ద్వారా ఫాస్ట్ ఫుడ్స్ కొనుగోలు చేస్తున్నారన్నారు.. వంటకాల విషయంలో పరిశుభ్రత, జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితమైన ఆహారాన్ని అందించాలన్నారు. పట్టణంలో స్వీట్ హోమ్ లు, బేకరీలు, హోటల్లు, రెస్టారెంట్లు నిర్వహించే యజమానులు రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అంటూ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతను పాటించాలని, నాణ్యమైన పరిశుభ్రమైన తాజా ఆహారాన్ని మాత్రమే ప్రజలకు విక్రయించాలన్నారు.. సరైన నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు.. ఆ పరిశుభ్రత ఆ జాగ్రత్తగా ఉన్నట్లు గుర్తిస్తే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరారు.. లేనిపక్షంలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి భారీ మొత్తంలో జరిమానాలు విధించి, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..ఈ తనిఖీలలో సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ ఆకు అంజయ్య,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు...

## జాల పాల సొసైటీ చైర్మన్ గా గొల్లపల్లి రాంరెడ్డి

**– వరుసగా పదవ సారి ఏకగ్రీవం**

**– పలువురు నాయకుల సన్మానం**



రాజపేట, జూన్ 14(తీన్మార్ న్యూస్): మండలంలోని జాల గ్రామ పాల సొసైటీ చైర్మన్ గా శుక్రవారం గొల్లపల్లి రాంరెడ్డి ఏకగ్రీవంగా వరుసగా పదవసారి ఎన్నికయ్యారు. కొత్త డైరెక్టర్లుగా కొండం ప్రభాకర్ రెడ్డి, కొల్లూరి కనకయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాల సొసైటీ సభ్యులు వారిని అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామ్ రెడ్డిని రాజాపేట మండల బిఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు మోత్కుపల్లి ప్రవీణ్, రాష్ట్ర రజక సంఘం నాయకులు సట్టు తిరుమలేష్, మండల ఉపాధ్యక్షులు ఎర్ర గోగుల జస్వంత్, యువజన నాయకులు పల్లె సంతోష్ గౌడ్, సంధిలా భాస్కర్ గౌడ్, కటకం స్వామి, సోమలింగం, కొన్యాల మల్లారెడ్డి, బీకాం సింగ్, మాజీ సర్పంచ్ బొంగుని ఉప్పలయ్య, గజ్జల రాజు, మోత్కుపల్లి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట
- విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలి
- విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు పాఠ్య పుస్తకాలు స్కూల్ యూనిఫార్మ్ పంపిణీ
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి





దేవరకద్ర ప్రతినిధి, జూన్ 14(తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలు పెంచి, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా అందిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా, మూసాపేట్ మండలం, కొమ్మిరెడ్డి పల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొక్కలు నాటి అనంతరం విద్యార్థులను ఆప్యాయంగా పలకరించి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలు పెంచి, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా అందిస్తామనిపేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులంతా బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే జియంఆర్ ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు, ఉచిత నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫార్మ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు



రాజాపేట, జూన్ 14(తీన్మార్ న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా టి.ఆర్.9 న్యూస్ ఛానల్ ప్రతినిధి తిప్పారం కనకయ్య మాతృమూర్తి, తిప్పారం పార్వతమ్మ ఈనెల 6వ మరణించగా శుక్రవారం స్వగృహమైన కొమురవెల్లి మండలంలోని రామ్ సాగర్ లో రాజాపేట మండల బిఆర్ఎస్ నాయకులు, తాజా మాజీ సర్పంచులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రజక సంఘం నాయకులు సట్టు తిరుమలేష్, మండల ఉపాధ్యక్షులు ఎర్ర గోగుల జస్వంత్, యువజన నాయకులు పల్లె సంతోష్ గౌడ్, సంధిలా భాస్కర్ గౌడ్, గజ్జల రాజు, మోత్కుపల్లి బాలకృష్ణ, తాజా మాజీ సర్పంచులు, ఠాగూర్ ధర్మేందర్ సింగ్, కనకయ్య, రాజు, ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పంట రుణాలపై అవగాహన కార్యక్రమం



**– నిర్వహించిన ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్**

ఆత్మకూర్, జూన్ 14(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండలం, పిన్నంచర్ల గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆత్మకూర్ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంట రుణాలు వివిధ రకాల పొదుపులు జీవిత బీమా బ్యాంకు లావాదేవీల పై అవగాహన కల్పించారు. పంట రుణాలు సంవత్సరంలోపు రెన్యువల్ చేసుకుంటే లాభాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. చిన్న పిల్లల బంగారు భవిష్యత్తుకు ఉపయోగపడే పాలసీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ ఆత్మకూర్ బ్యాంక్ మేనేజర్ నవీన్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మహమ్మద్ అలీ, అభినవ్ ప్రసాద్ కుమార్, గ్రామస్తులు కాజన్న, రాబర్ట్, నారాయణరెడ్డి, దర్శన్ గౌడ్, సత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**– సన్మానించిన ఎంపీటీసీ దంపతులు**

రాజాపేట, జూన్ 14(తీన్మార్ న్యూస్): రాజపేట మండలం, రఘునాథపురం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో శుక్రవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుడిగే రేణుక పెంటయ్యగౌడ్, మాజీ సర్పంచ్ గడిపల్లి శ్రవణ్ కుమార్, అలయకమిటి చైర్మన్ చింతకింది రాందాస్, అలయ కమిటి వైస్ చైర్మన్ రాచకొండ స్వామి, గ్రామశాఖ అధ్యక్షుడు బింగి రమేష్, రాజపేట మండల పార్టీ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాపోలు లక్ష్మారెడ్డి,





యస్.సి సెల్ జిల్లా అధ్యక్షుడు రాంజీ నాయక్, విఠల్ నాయక్, బొంతసుధాకర్, ఇంజనరేశ్, బాల్ద శ్రీకాంత్ కళ్యెం పాండు, చల్లూరి చిన్నపోచయ్య,బల్ల యదేశ్, డొంకెన భాస్కర్, బల్లమురళి, గొట్టిపాముల సిద్ధిరములు, ఆదేపు సత్యనారాయణ, బత్తిని పాండు, వెంకటేశం, కలకుట్ల సంపత్, కటీకం ప్రశాంత్, బల్ల హరిష్, కటకం గణేష్, శ్యామల, పరమేష్, బల్ల మహేష్, గోల కిరణ్, కలకుంట్ల కిషన్ గౌడ్, ఎలిగేటి మధు, గడ్డమీది రాజు, బీదని శ్రీధర్, నారాయణ, లాలయ్య, శ్రవణ్ కుమార్, తమ్మలి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## తాళ్ళ మల్లేశం ముదిరాజ్ చిత్ర పటానికి నివాళులు



**మెపా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం**

వరంగల్, జూన్ 14 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా, దుగ్గొండి మండలం, చంద్రయ్య పల్లికి చెందిన మెపా రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్ళ రవీందర్ ముదిరాజ్ తండ్రి తాళ్ళ మల్లేశం ముదిరాజ్ గత సం.అనారోగ్య కారణాల వలన మృతి చెందారు.విషయం తెలుసుకున్న మెపా ( ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చంద్రయ్యపల్లిలోని వారి గ్రామానికి వెళ్లి మల్లేశం ముదిరాజ్ శిలాఫలకానికి అలాగే మల్లేశం ముదిరాజ్ స్మారక చిహ్నానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మౌనం పాటించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ మల్లేశం ముదిరాజ్ ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, ముదిరాజ్ లు ఆపద సమయంలో కలిసి కట్టుగా ఉండాలనీ, సుఖ దుఃఖాలను కలిసి పంచుకోవాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శులు నీరటి రాజు ముదిరాజ్, సింగారపు రామ కృష్ణ ముదిరాజ్, దండు చిరంజీవి ముదిరాజ్, అచ్చునూరి కిషన్ ముదిరాజ్, పెండ్యాల కృష్ణ,అమ్మగారి శ్యామ్, జిల్లా నాయకులు రావుల రాజు, పాండవుల రామ కృష్ణ, వెంకటేష్, హరినాథ్, రమేష్, మొద్దు రాఘవులు, లక్క రాజు, ముదిరాజ్, ఈర్ల కొమ్మాలు ముదిరాజ్ లు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతీ యువకులు మెగా జాబ్ మేళా

**జాబ్ మేళాలో పాల్గొననున్న 58 కంపెనీలు**

**రాష్ట్ర మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క**



ములుగు, జూన్ 14 (తీన్మార్ న్యూస్): గ్రామీణ ప్రాంతాలలో ఉండే నిరుద్యోగ యువతీ యువకులు ఈ నేల 19న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ములుగు మండలంలోని ఇంచేర్ల గ్రామములోని ఎంఆర్ గార్డెన్ లో 58 కంపెనీలు విప్రో, ముథ్ ద్ గ్రూప్స్,అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్, నెక్సా మోటార్స్, ఆక్సస్ బ్యాంక్ వెట్రో సాఫ్టెక్ సొల్యూషన్ మేడ్ ప్లస్, ఎగ్జిట్ ఐ సొల్యూషన్, సేవన్ టెక్ ఐటి సొల్యూషన్ శ్రీ చైతన్య విద్య సంస్థలు వంటి 58 కంపెనీలు మెగాజాబ్ మేళాలో పాల్గొంటాయి విద్యార్హతలు 7వ తరగతి నుండి డిగ్రీతో పాటు వృత్తి విద్య కోర్సులు చేసిన వారికి వారి, వారి విద్య అర్హత ను బట్టి ఇంటర్వ్యూ నిర్వహించి వెంటనే ఉద్యోగాల్లో చేర్చుకోవడం జరుగుతుంది అని కావున ములుగు నియోజక వర్గం మరియు జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని యువతి యువకులు రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభి వృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రివర్యులు డాక్టర్ సీతక్క పిలుపునిచ్చారు.

## గోవద అరికట్టాలని ఎస్సైకి వి.హెచ్.పి వినతి




రాజాపేట, జూన్ 14(తీన్మార్ న్యూస్): రాజాపేట మండలంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజాపేట పోలీస్ స్టేషన్ లో వినతి పత్రం అందజేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా రాజాపేట మండలంలో, పరిసర గ్రామాలలో అక్రమంగా గోహత్యలు విచ్చల విడిగా గోవధ జరుగుతున్నదని హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా శాంతి భద్రతలకు ఆటంకం కలుగకుండా చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, ఈ విషయం గురుంచి పలుమార్లు ఫిర్యాదు చేయడం జరిగిందని, అయినప్పటికీ గోవధలు ఆగడం లేదని తగిన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని రాజపేట ఎసై సుధాకర్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాజాపేట అధ్యక్షులు భోగ జ్ఞానేంధర్, వి. హెచ్. పి జిల్లా ఉపాధ్యక్షులు బూర్గు సంతోష్ రెడ్డి, బజరంగ్ దళ్ జిల్లా కో కన్వీనర్ మార్క శ్రవణ్ కుమార్, మండల సహా సంయోజక్ కోయ అమర్, అయిరేని శ్రీధర్, పబ్బోజు శ్రీధర్, రేగొండ మాధవ్, వెంకటేష్, కృష్ణ, చింటూ, ప్రవీణ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు పురపాలక సాధారణ సమావేశం




ఆత్మకూర్, జూన్ 14(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మున్సిపాలిటీ లో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 2024-25 సంవత్సరానికి వార్షిక బడ్జెట్కు సంబంధించి పురపాలక సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరం సంబంధించి ఐదు లక్షల రూపాయలు పట్టణ అభివృద్ధికి, సిబ్బంది సామాను కొనుగోలుకు రెండు లక్షల రూపాయలు పారిశుద్ధ్య నిమిత్తం 6 లక్షల రూపాయలు వీధి దీపాలు కరెంటు సంబంధించి 20 లక్షల రూపాయలు నీటి నిర్వహణకు 5 లక్షల రూపాయలు హరితహారంకు 30 లక్షలు రూపాయలు నీటి మరమ్మత్తుకు 8 లక్షలు రూపాయలు మొత్తం 40 రకాల అభివృద్ధి పనుల గాను మొత్తం కోటి రూపాయలకు పైగా బడ్జెట్కు కౌన్సిల్ సమావేశంలో పురపాలక కమిషనర్ నాగరాజు, ఆత్మకూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్, వైస్ చైర్ పర్సన్ విజయభాస్కర్ రెడ్డి, కౌన్సిలర్ల సమక్షంలో బడ్జెట్కు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మండ్ల రామకృష్ణ, చెన్నయ్య, పోషన్న, అశ్విన్ కుమార్, మహేశ్వరి, యాదమ్మ, తబుస్సుం మోసిన్, తదితరులు పాల్గొన్నారు.



# కులగణన దిశగా అడుగులు

వరంగల్: తెలంగాణలో దశాబ్దాలుగా డిమాండ్ చేస్తూ వస్తున్న కులగణనపై కసరత్తు ప్రారంభమయింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర సామాజిక వర్గాలకు సంబంధించిన కుల సర్వే చేయడానికి గతంలోనే అసెంబ్లీలో అమోదం లభించింది. ఈలోగా ఎన్నికల కోడ్, పార్లమెంట్ ఎన్నికల హడావిడితో కులగణన అంశం పెండింగ్ లో ఉండిపోయింది. అయితే రాష్ట్రంలో చేపట్టబోయే కులగణనకు దాదాపు అన్ని పార్టీలు సుముఖంగానే ఉన్నాయి. కేంద్రంలో బీజేపీ సర్కార్ అంత సానుకూలంగా లేకపోయినా తెలంగాణలో రాష్ట్ర నేతలు మాత్రం కులగణనకు మద్దతు తెలుపుతునే ఉన్నారు. ఈ మేరకు కులసర్వే విధివిధానాల అమలు పద్ధతులు, ప్రశ్నావళి రూపకల్పన తధితర పద్ధతులపై బీసీ కమిషన్ చర్యలు మొదలుపెట్టింది. ఇటీవల జరిగిన సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులతో పీపుల్స్ కమిటీ భేటీ అయింది. కులగణనపై ఏ రకంగా ముందుకు వెళ్లాలనే అంశంపై చర్చ జరిపారు. స్థానిక ఎన్నికలు జరిగే లోపే రాష్ట్రంలో కులగణన ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అసలు ఈ కులగణన ఏమిటి? దీని వలన వచ్చే లాభం ఏమిటి? దాని ఆవశ్యకత ఏమిటి అని చాలా మందికి సందేహాలున్నాయి. భారత దేశంలో మొట్టమొదటిసారి 1931లో బ్రిటీష్ కాలంలోనే కులగణన జరిగింది. అప్పటికి పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాలు కూడా భారత్ లోనే కలిసివున్నాయి. ఆ తర్వాత ఇప్పటిదాకా ఏ ప్రభుత్వం కూడా కులగణన అంశాన్ని సీరియస్ గా తీసుకోలేదు. పైగా 1941 జనాభా లెక్కల నుంచి ఈ కేటగిరీనే తీసివేశారు. చదువు, ఉద్యోగాల కోసం దరఖాస్తులలో కులం కేటగిరీని చేర్చారు. కేవలం ఆ లెక్కల ఆధారంగానే ఇప్పటిదాకా ఇంత మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, తదితరులు ఉన్నారని లెక్కలు వేస్తూ వస్తున్నారు. వీటి ఆధారంగానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం అమలుచేస్తూ వస్తున్నారు. అయితే ఇవన్నీ అధికారిక లెక్కల కిందకి రావు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 2011-12లో సామాజిక, ఆర్థిక, కులగణన చేపట్టింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వం. అయితే ఆ లెక్కలేవీ ఇప్పటిదాకా బయటకు రాకపోవడం గమనార్హం. సాధారణంగా జనాభా లెక్కల్లో కేవలం ఎస్సీ, ఎస్టీ జనాభాను మాత్రమే లెక్కలేస్తారు. కానీ అన్ని సామాజిక వర్గాల జీవన స్థితిగతులు ముఖ్యంగా ఆర్థిక, ఉపాధి, ఉద్యోగ, వ్యవసాయ, సంఘటిత, అసంఘటిత వ్యాపార రంగాలను కూడా ప్రాతిపదికన తీసుకోవాలి. అలా జరిగినప్పుడే అన్ని వర్గాలకు లబ్ధి చేకూరే అవకాశం కలుగుతుంది. మనదేశంలో జనాభా లెక్కలు మొదలైన కొత్తలో ఎక్కువమంది ప్రజలు వ్యవసాయం, కుటీర పరిశ్రమలు, కులవృత్తులు, చిరువ్యాపారాలు, కూలీపనులు చేస్తూ బతికేవాళ్లు. కానీ.. స్వాతంత్రం వచ్చాక ఆధునిక పరిశ్రమలు, సేవారంగం విస్తరించాయి. అనాదిగా ఉన్న అనేక వృత్తులు అదృశ్యమైపోతున్నాయి. చిరువ్యాపారులు తమ అవకాశాలు కోల్పోతున్నారు. కార్పొరేట్ వ్యాపార సంస్థల వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై పోయిన విషయం స్పష్టంగా కనిపిస్తోంది. నూతన ఆర్థిక విధానాల వల్ల ఆర్థిక అసమానతలు అనేక రెట్లు పెరిగాయని అనేక జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు చెప్తున్నాయి. కాబట్టి ఇప్పటి పరిస్థితులు ఎలా ఉన్నాయనేది తెసుకోవాల్సిన, అన్ని కులాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, ఉపాధి, ఉద్యోగ పరిస్థితులపై ఒక సమగ్ర అంచనా వేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏ టెక్నాలజీ, సరైన ప్రభుత్వం, అధికార యంత్రాంగం లేని టైం1881లోనే కులగణన జరిగింది. అలాంటిది ఇప్పుడు పటిష్టమైన ప్రభుత్వాలు, అధికారులు, టెక్నాలజీ సపోర్ట్‌గా ఉండగా ఇప్పుడు కులగణన చేయడం అంత పెద్ద కష్టమేమీ కాదు. ఇప్పటికే బీహార్, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కులగణన చేశారు. కానీ.. వాటికి ఆ ప్రభుత్వాలు పెట్టిన పేర్లే వేరు. రాష్ట్రాలకు తగిన అధికారం లేకపోవడం వల్ల సర్వే పేరుతో కులగణన చేస్తున్నారు. కాకపోతే.. వీటిలో తెలంగాణతోపాటు మరికొన్ని రాష్ట్రాలు ఆ డాటాను బయటపెట్టలేదు. అయితే.. ఈ గణనలో కులం ఒక్కటే కాకుండా ఆ కుటుంబాల సమగ్ర పరిస్థితి కనుక్కోవాలి. అప్పుడే వాళ్లు ఏ పరిస్థితుల్లో ఉన్నారు? వాళ్ల కోసం ప్రభుత్వాలు ఏం చేయాలి? అనేది తెలుస్తుంది.

# ఆడపిల్లలకు బాత్ రూమ్ లు ఎప్పుడు..?

నిజామాడాద్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరుతో మౌలిక వసతులు చేపట్టడానికి ఇచ్చిన ఉత్తర్వులు ఊ ఓబ ఔనీ -5 జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఈ కమిటీలు పాఠశాలల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాలను కల్పించటం కోసం పది అంశాలుగా శ్రీకారం చుట్టాయని చెబుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎంతో ప్రశంసనీయమైనదని వ్యాఖ్యానిస్తున్నారు. ఇంత వరకు బాగానే వుంది కానీ రాష్ట్రంలో నిన్నటి నుండి బడి గడప తొక్కుతున్న బంగారు తల్లులకు బాత్‌రూమ్ సౌకర్యాలు కల్పించడానికి ముఖ్యమంత్రికి మనసేందుకు రావడం లేదని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలు -25,331, మాధ్యమిక పాఠశాలలు 6883, ప్రాథమిక ఒ మాధ్యమిక పాఠశాలలు 123, మాధ్యమిక ఒ హైస్కూల్ 202, మాధ్యమిక ఒ సెకండరీ స్కూల్స్ 9937, ప్రాథమిక మాధ్యమిక ఒ మాధ్యమిక సెకండరీ స్కూల్స్ 817... మొత్తం 43,293 వేల వరకు ఉన్న పాఠశాలల్లో 35 వేలకు పైగా పాఠశాలలకు మూత్రశాలలు లేవు. మూత్రశాలలు ఉన్నా వాటిని ఉపయోగించడానికి ఏమాత్రం పనికిరాకుండా తయారైనవి. నీటి సౌకర్యం లేని కారణంగా అనేక విద్యాసంస్థల్లో మూత్రశాలకు తాళాలు పడివున్నాయి. మూత్రశాలలు, నీటి సౌకర్యం కలిగివున్న విద్యా సంస్థలకు స్కావెంజర్ పోస్ట్ లేని కారణంగా తీవ్రమైన దుర్వాసనలు వస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్‌లో సుమారు 30 లక్షల మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో ప్రతి ముగ్గురిలో ఒక్కరికి మాత్రమే మూత్రశాలల సౌకర్యం ఉన్నదని అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి.. రాష్ట్రంలో రెండు వేల హాస్టల్స్ ప్రైవేటు భవనంలో నడుస్తున్నాయి. ఈ భవనాలలో 200 మంది విద్యార్థులకు రెండు బాత్‌రూములు మాత్రమే ఉంటున్నాయి. కొన్నిహాస్టల్స్‌లో విద్యార్థినులు పాత చున్నీలతో మూత్రశాలలను నిర్మించుకుంటున్నారు. మరికొన్నిచోట్ల కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం కోడి కూతకన్న ముందే లేచి చెరువులు, వాగులు చెంతకు చేరుతున్నారు. ఇలా ఆరు బయటకు వెళుతున్నప్పుడు పదుల సంఖ్యలో విద్యార్థినులు విష సర్పాల కాటుకు గురై, నీటి ప్రవాహంలో పడి చనిపోతున్నారు. కొన్ని జిల్లాలలో పాఠశాలలకు వస్తున్న మహిళా టీచర్లకు సైతం మూత్రశాలల సౌకర్యం లేక కేవలం మూత్రశాలల కొరకే స్కూల్ పక్కన గల ఇంటిని అద్దెలకు తీసుకుంటున్నారు 77 సంవత్సరాల పాలనలో భావి పౌరులు మరుగుదొడ్లు లేక, బహిరంగ ప్రదేశాలలో కాలకృత్యాలు తీర్చుకోవడం స్వతంత్ర భారతదేశంలో సిగ్గుపడాల్సిన విషయం.. విద్యాసంస్థలలో మరుగుదొడ్లు మంచినీటి సౌకర్యం కల్పించాలని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేకపోతే కోర్టు తీవ్రంగా మందలిస్తూ ఆరు నెలల్లో అన్ని విద్యాసంస్థలకు మూత్రశాలలూ, మంచినీటి సౌకర్యం కల్పించాలని మళ్లీ ఆదేశించింది. అయినా ప్రభుత్వం కాళ్లు కదపలేదు. ఆడపిల్లగా పుట్టినందుకా మాకు ఇంత 'ఘోష అంటూ విద్యార్థినీలు నిలదీస్తున్నా స్పందించే నాధుడే లేదు. మన పక్కనే తమిళనాడు, పంజాబ్ ఉత్తరప్రదేశ్, హర్యానా తదితర రాష్ట్రాల కన్నా మన రాష్ట్రం విద్యా సంస్థలలో మౌలిక వసతులు కల్పించడంలో బాగా వెనకబడిపోయిందని జాతీయ సర్వేలు తెలుపుతున్నాయి. విద్యా హక్కు చట్టం వస్తే మన విద్యా సంస్థలకు సకల సౌకర్యాలు వస్తాయని ప్రభుత్వాలు చెప్పాయి. ఈ చట్టం అమల్లోకి వచ్చి 14 సంవత్సరాలు పూర్తయింది. అయినా పాఠశాలల్లో ఈ మౌలికమైన మార్పులు జరగలేదు. మూత్రశాలల సౌకర్యం మెరుగుపడలేదు. పాలకులకి ఓట్లు రాల్చే పథకాల పైన ఉన్న ప్రేమ బాలికల విద్యా భవిష్యత్తుపై లేకపోవడం దురదృష్టకరం. మన మూత్రశాలల్లో చిట్టి తల్లులకు చింతలు తీర్చేవారు లేకపోవడం ఘోరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఇక అందరికి బయోమెట్రిక్...

హైదరాబాద్: ప్రభుత్వ కార్యాలయాలలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇక క్రమశిక్షణ పద్ధతులు అమలుచేయనున్నారా? సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారా? అవును నిజమే రాష్ట్రవ్యాప్తంగా ఇకపై అన్ని గవర్నమెంట్ ఆఫీసుల్లో బయోమెట్రిక్ హాజరును అమలుచేయాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారని సమాచారం. సచివాలయం సిబ్బంది ప్రతిరోజూ కార్యాలయం లోపలకి, బయటకు వెళ్లేటప్పుడు బయోమెట్రిక్ పంచ్ తప్పనిసరిగా చేయాలనే యోచనలో రేవంత్ సర్కార్ ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలలో చర్చ జరుగుతోంది. అయితే ఈ పంచింగ్ సిస్టమ్ సీఎం కూ వర్తిస్తుందని సీఎం టూ అటెండర్ వరకూ తప్పనిసరిగా బయోమెట్రిక్ థంబ్ నైల్ ఉండబోతోందని సమాచారం. ఉద్యోగుల్లో క్రమశిక్షణ, జవాబుదారీతనం పెంచేందుకు బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేయాలని సీఎం యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ ఉద్యోగులపై వచ్చిన విమర్శలను సీఎం సీరియస్‌గా తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో ముందుగా సచివాలయంలో బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలని సీఎస్ శాంతికుమారికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రతి ఒక్కరికీ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయాలని యోచిస్తున్నామన్నారు. ఫలితంగా మంత్రులు, ఐఏఎస్‌లు, సచివాలయ ఉద్యోగులకు కూడా పంచ్‌లు చేయాల్సి ఉంటుందని సీఎం తన సన్నిహితులతో అన్నట్లు సమాచారం.

సీఎం, సీఎస్, మంత్రులందరూ బయోమెట్రిక్ హాజరును పాటిస్తున్నందున కిందిస్థాయి ఉద్యోగుల విమర్శలకు ఆస్కారం ఉండదని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేయాలని సీఎం కోరుతున్న సంగతి తెలిసిందే. కార్యాలయానికి వచ్చినప్పుడు, ఇంటికి వెళ్లేటప్పుడు కూడా పంచ్‌లు వేస్తే ప్రభుత్వ ఉద్యోగులపై ప్రజల్లో ఉన్న ప్రతికూల అభిప్రాయం తొలగిపోతుందని సీఎం అభిప్రాయపడినట్లు సమాచారం. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరును అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించడం చర్చనీయాంశమవుతోంది. బయోమెట్రిక్ వల్ల ఉద్యోగులపై నిఘా, పనుల్లో వేగం పెంచడంతోపాటు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించే అవకాశం ఉందని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. అయితే మొదట్లో ఉద్యోగుల నుంచి విమర్శలు వచ్చినా.. చివరికి ప్రజల నుంచి ప్రశంసలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

# సింగరేణి ఉద్యోగులకు గుడ్ న్యూస్

అదిలాబాద్: సింగరేణి కారుణ్య నియామక ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారసుల గరిష్ఠ వయో పరిమితి 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వయో పరిమితి పెంపు ఉత్తర్వులు వెలువడ్డాయి. 2018 మార్చి 9 కటాఫ్ తేదీ నుంచి ఈ ఆదేశాలు అమలు చేస్తున్నట్లు సింగరేణి సీఎండీ వెల్లడించారు. ఈ ఉత్తర్వులతో 300 మంది నిరుద్యోగులు తక్షణమే లబ్ధి పొందనున్నారు. సింగరేణి కారుణ్య ఉద్యోగాల గరిష్ఠ వయోపరిమితిని 40 ఏళ్లకు పెంచారు. ఈ మేరకు సోమవారం సింగరేణి సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు గరిష్ఠ వయోపరిమితి 35 ఏళ్లుగా ఉండగా, కార్మిక సంఘాల వినతి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సింగరేణి కార్మికుడు మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్‌కు గురైనా, మరణించినా కారుణ్య నియామకాల్లో వారసులకు ఉద్యోగాలు కల్పిస్తారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించింది. కార్మికుల సంక్షేమంలో భాగంగా వారి కుటుంబాలకు విద్య, వైద్యం, ఇతర వసతుల కల్పనపై దృష్టి పెట్టింది. ప్రమాదంలో గాయపడిన, మృతి చెందిన కార్మికులను, వారి కుటుంబాలకు రూ.కోటి బీమా సదుపాయాన్ని సంస్థ అందిస్తోంది. దీంతో పాటు సింగరేణి కార్మికుల పిల్లలకు అత్యున్నత ప్రమాణాలతో చదువులు అందించేందుకు కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా సింగరేణి కార్మికుల పిల్లల కోసం నిర్వహిస్తున్న పాఠశాలలను ఆధునీకరించడం, డిజిటలీకరణతో పాటు స్టేట్ సిలబస్ స్థానంలో సీబీఎస్‌ఈసిలబస్‌అమలు చేయాలని నిర్ణయించింది. సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తున్న కాలేజీలను, ఇంజినీరింగ్ కాలేజీలను ఆధునీకరించాలని నిర్ణయించింది. కార్మికుల పాత క్వార్టర్స్ను ఆధునీకరించి, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సింగరేణి యాజమాన్యం భావిస్తోంది. ఆఫీసర్లకు మాదిరాగే కార్మికుల క్వార్టర్స్ ను అప్గ్రేడ్ చేయాలని యోచిస్తోంది. సింగరేణిలోని 6 ప్రాంతాల పరిధిలో 42 వేలకు పైగా కార్మికులు ఉన్నారు. వీరంతా చాలా వరకు పాత క్వార్టర్స్లోనే ఉంటున్నాయి. వర్షాకాలం ఇబ్బందులు తలెత్తుతున్నాయని కార్మికులు తరచూ ఫిర్యాదు చేస్తు?న్నారు. దీంతో పాత క్వార్టర్స్ తొలగించి వాటి స్థానంలో మోడ్రన్క్వార్టర్స్ నిర్మించాలని యాజమాన్యం నిశ్చయించింది. సింగరేణిలోని ఆసుపత్రులను సూపర్స్పెషాలిటీ హాస్పిటల్గా తీర్చిదిద్దాలని సింగరేణి యాజామాన్యం యోచిస్తోంది. కొత్తగూడెం, రామగుండంతో పాటు పలు ప్రాంతాల్లో ఆసుపత్రులను అప్గ్రేడ్ చేయాలని భావిస్తోంది. ప్రస్తుతం సింగరేణి ఆసుపత్రుల్లో సాధారణ వైద్యమే అందిస్తున్నారు. ఆధునిక వైద్యం కోసం హైదరాబాద్నిమ్స్, ఇతర ప్రైవేటు ఆసుపత్రులకు పంపేవారు. అయితే ఇకపై కార్మికులకు గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు, ఆర్థోపెడిక్చికిత్సలను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు సూపర్స్పెషాలిటీ ఆసుపత్రులుగా తీర్చిదిద్దాలని యాజమాన్యం భావిస్తోంది.

# ఆగని చెరువుల ఆక్రమణలు

రంగారెడ్డి: హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తోంది. రోజురోజుకీ భవన నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం దూసుకెళ్తోంది. ఈ క్రమంలో కబ్జాలు కూడా విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ప్రభుత్వ భూములు మాయం అవుతున్నాయి. చెరువులు సైతం కనిపించకుండాపోతున్నాయి. కాలువలను కబ్జా చేసి, చెరువులను మాయం చేసి పెద్దపెద్ద నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే ఎన్నో వివాదాలు నెలకొన్నాయి. వాటిలో ఎర్రకుంట చెరువు ఒకటి. బాచుపల్లిలోని సర్వే నెంబర్ 134లో ఉంటుంది ఎర్రకుంట చెరువు(లేక్ ఐడీ: 2800/ఈ/17). అయితే, ఇక్కడ మూడు నిర్మాణాలకి హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారుల నుంచి పర్మిషన్ రావడం వివాదాస్పదమైంది. చాలా రోజులుగా దీనిపై స్థానిక బీజేపీ నేతలు పోరాడుతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మార్చి 18న సర్వే జరిగింది. డీఐ సర్వేయర్ గంగాధర్, ఏడీ శ్రీనివాస్, బాచుపల్లి ఎంఆర్ఓ రిపోర్ట్ రెడీ చేశారు. అందులో ప్రభుత్వ భూమి కబ్జా కాలేదని, అది ప్రవేట్ భూమేనని పేర్కొన్నారు. దీన్నిబట్టి ఎర్రకుంట చెరువు మొత్తాన్ని ప్రైవేట్ వ్యక్తుల చేతులకి అప్పగించే కుట్రలు జరుగుతున్నాయని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. డీఐ సర్వేయర్ గంగాధర్, ఏడీ శ్రీనివాస్ తీరుపై ముందు నుంచి అనుమానాలు ఉన్నాయి. ఒక్కో కో ఆర్డినేట్‌ను దాదాపు 9 మీటర్ల మేర జరిపి కార్పొరేటర్, కొందరు బిల్డర్లకు లబ్ధి చేకూర్చేలా సర్వే చేశారని అంటున్నారు. మార్చి 11 తేదీన సర్వేలో చెరువు స్థలం 3 ఎకరాలు వస్తే, 18వ తేదీ చూపించిన హద్దుల తర్వాత 2.19 ఎకరాలు మాత్రమే వచ్చిందని ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. చెరువు స్థలం ఎందుకు తగ్గింది? ఎలా తగ్గిందని అడుగుతున్నారు బీజేపీ నేతలు. ఎర్రకుంటలోని ఆక్రమణలు తొలగించే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తప్పుల తడకగా సర్వే నిర్వహించారని ఆరోపించారు. ఎర్రకుంట చెరువును క్రమించి తప్పుడు పత్రాలలో అనుమతులు పొంది ధ్వంసం చేశారని, సరైన సర్వే చేసి కాపాడాలని డిమాండ్ చేశారు బీజేపీ నేతలు. కలెక్టర్‌కు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేస్తే ఇప్పటికి గానీ సర్వేకు రాలేదని, తీరా సర్వే చేసి మూడు ఎకరాల ఎర్రకుంట చెరువు ప్రభుత్వ భూమి కాదని ప్రైవేట్‌దని రిపోర్ట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విధంగా సర్వే రిపోర్ట్ ఇవ్వడం వెనుక కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. సర్వేయర్లు దాదాపు రెండు కోట్ల ముడుపులు దండుకొని ఆక్రమణదారులకు అనుకూలంగా సర్వే రిపోర్ట్ తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్, హెచ్ఎండీఏ అధికారులు అక్రమ అనుమతులు, తప్పుడు సర్వే రిపోర్ట్‌పై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. డీఐ సర్వేయర్ గంగాధర్, ఏడీ సర్వేయర్ శ్రీనివాస్‌ను తక్షణమే సస్పెండ్ చేసి విచారణ జరిపి, ఎర్రకుంట చెరువులో అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని, లేకపోతే అక్కడ టెంటు వేసి నిరాహార దీక్షకు దిగుతామని బీజేపీ నాయకులు, కార్పొరేషన్ సెక్రెటరీ అరుణ్ రావు, మీడియా సెల్ కో కన్వీనర్ ఉదయ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు ప్రసాద్ రాజు, ఉపాధ్యక్షులు మాధవరావు, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ముఖేష్ సీనియర్ నాయకులు ఎల్లస్వామి, కాలనీవాసులు తదితరులు హెచ్చరించారు. గత తొమ్మిది సంవత్సరాల్లో బీఆర్ఎస్ నేతలు కబ్జాలకు సహకరించి, అనుమతులు ఇప్పించి ఇప్పుడు చెరువులు కాపాడాలని ఎమ్మెల్యే వివేకానంద చిలుక పలుకులు పలుకుతున్నారని, చిత్తశుద్ధి ఉంటే ఎర్రకుంటను కాపాడాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ గౌతం, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి దీనిపై దృష్టి సారించాలని కోరారు.

# లోకల్ బాడీ ఎన్నికల తర్వాతే కొత్త పీసీసీ

హైదరాబాద్, తెలంగాణలో పీసీసీ పీఠం కాంగ్రెస్ లో ఎడతెగని పంచాయితీలా మారేలా ఉంది. గతంలో సీఎం సీటుకు కూడా ఈ స్థాయిలో పోటీలేదని ఆ పార్టీ వర్గాలే అంటున్నాయి. అయితే అధిష్టానం మాత్రం రేవంత్ నాయకత్వంపై ఎలాంటి సందేహం లేకుండా పూర్తి నమ్మకం పెట్టుకుంది. అయితే ఈ సారి మాత్రం పీసీసీ పీఠం విషయంలో సీనియర్లంతా ఎవరికి వారే తమకే ఇవ్వాలని పట్టుబడుతున్నారు. బీసీ వర్గానికి చెందిన నేతనే ఈ సారి పీసీసీ పీఠంపై కూర్చోబెట్టాలని అధిష్టానం భావిస్తోంది. దీనితో భట్టి విక్రమార్క, మహేష్ కుమార్ గౌడ్, మధుయాష్కీ తదితర నేతలంతా తమకే పీసీసీ దక్కాలని గట్టి ప్రయత్నాలే చేస్తున్నారని సమాచారం. అయితే త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడిని మారిస్తే తలనొప్పిగా మారొచ్చని అధిష్టానం భావిస్తోందని సమాచారం. ప్రస్తుత సీఎం పీసీసీగా ఉండి అసెంబ్లీలో కష్టపడి తెలంగాణను పవర్ లోకి తెచ్చారని హైకమాండ్ విశ్వసిస్తోంది. పైగా లోక్ సభలోనూ ఫలితాలు బాగానే వచ్చాయి. సీనియర్లందరినీ ఒక తాటిపైకి తేవడం, పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేయడం, అగ్రనేతల పర్యటనలను భారీ ఎత్తున చేసిన ఏర్పాట్లు, అధిష్టానానికి విధేయుడుగా ఉండటం ఇవన్నీ కలిపి హై కమాండ్ వద్ద రేవంత్ కు మంచి పేరే ఉంది. పైగా అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో జనాల మద్దతు పొందడంలో రేవంత్ క్రియాశీలక పాత్ర పోషించారని ఏఐసీసీ నమ్ముతోంది. స్థానిక ఎన్నికల తర్వాతే పీసీసీని మారిస్తే సరిపోతుందనే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు సమాచారం. ఎందుకంటే అందరూ సీనియర్లే కాబట్టి ఎవరికి ఇచ్చినా మిగిలినవారు గ్రూపులుగా విడిపోవచ్చు. ఆ ప్రభావం స్థానిక ఎన్నికలలో చూపించే ప్రమాదం లేకపోలేదు. స్థానిక ఎన్నికలలో కూడా కాంగ్రెస్ ఓకే అనిపించుకుంటే ఇక ఐదేళ్ల దాకా ఢోకా లేదని అధిష్టానం భావిస్తోంది. అందుకే స్థానిక ఎన్నికలు అయ్యేదాకా కొంతకాలం పీసీసీ అధ్యక్షుడిని కంటిన్యూ చేస్తే ఎలా ఉంటుంది? అనే అంశంపై పార్టీ ఆలోచిస్తున్నట్లు సమాచారం. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి దాదాపు ఏడేళ్లు పనిచేశారని కొందరు నేతలు గుర్తు చేసుకుంటున్నారు. పార్టీని పవర్ లోకి తీసుకువచ్చిన రేవంత్ ను మరో టర్మ్ వరకు కొనసాగించే అవకాశం కూడా లేకపోలేదని ఇలాంటి సమయంలో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఉంటేనే మేలనే చర్చ కూడా పార్టీలో నడుస్తోంది.

# మల్లారెడ్డికి టీటీడీపీ బాధ్యతలు..?

హైదరాబాద్: తెలంగాణలో రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఫలితాలు తర్వాత ఊహించని మార్పులు వస్తాయని నేతలు బహిరంగంగా చెప్పారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న చాలా మంది నాయకులు తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దాదాపు ఆరుగురు నేతలు ఇప్పటికే అధినేత చంద్రబాబుతో మంతనాలు జరిపినట్లు అందులోని సారాంశం. అదే జరిగితే కారు పార్టీ ఖాళీ కావడం ఖాయమని చర్చించుకుంటున్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లపాటు పాలించింది టీఆర్ఎస్ అలియాస్ బీఆర్ఎస్ పార్టీ. అందులోని నేతలంతా దాదాపు టీడీపీ నుంచి వెళ్లినవారే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు తారుమారయ్యాయి.

బీఆర్ఎస్ బదులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈసారి బీఆర్ఎస్ నుంచి గెలిచినవాళ్లలో తెలుగుదేశం పార్టీ నుంచి వెళ్లినవారు ఉన్నారు. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడును బీఆర్ఎస్‌లోని చాలామంది నేతలు తట్టుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో సొంతగూటికి చేరుకోవాలనే ఆలోచనలో నేతలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా మాజీ మంత్రి మల్లారెడ్డి కూడా అందులో వున్నట్లు సమాచారం. తెలంగాణ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మల్లారెడ్డి ఆగడాలు బయటకు వచ్చాయి. ల్యాండ్ కబ్జాలు, కాలేజీలో విద్యార్థుల ధర్నాలు వంటి ఘటనలతో ఆయన కొంత బేజారు అయినట్టు తెలుస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ వైపు వెళ్లకుండా టీడీపీ వైపు వెళ్తేనే బెటరని ఓ వ్యక్తి సలహా ఇచ్చారట. ఈ క్రమంలో చంద్రబాబుతో ఆయన మంతనాలు చేసినట్టు తెలుస్తోంది. అదే జరిగితే తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం రావడం ఖాయమన్నమాట. గతంలో చాలాసార్లు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పిలుపు నిచ్చారు. తమ పార్టీ నుంచి వెళ్లిన నేతలు తిరిగి రావాలని విజ్ఞప్తి చేశారు. చివరకు పలువురు నేతలకు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే బీఆర్ఎస్ పాత్రను తెలుగుదేశం పోషించడం ఖాయమని అంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీజేపీ వైపు వెళ్లడం కరెక్ట్ కాదని, మరింత ఒత్తిళ్లు పెరుగుతాయని అంటున్నారు. ఈ ప్రచారం గురించి మాజీ మంత్రి మల్లారెడ్డి ఏమంటారో చూడాలి.

# ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు విషయంలో కేసీఆర్‌కు నోటీసులు

హైదరాబాద్ ;: ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు విషయంలో కేసీఆర్‌కు నోటీసులు అందాయి. ఈనెల 15 లోగా వివరణ ఇవ్వాలంటూ జస్టిస్ నర్సింహారెడ్డి ఈ నోటీసులు జారీ చేశారు. కాగా విచారణకు హాజరయ్యేందుకు జులై 30 వరకు సమయం కావాలని కేసీఆర్ కోరారు. డు అంశాల విచారణ కొనసాగుతోందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నోటీసుల్లో పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్లపై విచారణ కొనసాగుతోందని అన్నారు. టెండర్ల ప్రక్రియ లేకుండా ఒప్పందాలు జరిగాయని, 25 మందికి నోటీసులు ఇచ్చామని నరసింహారెడ్డి పేర్కొన్నారు. కాగా మాజీ సీఎం కేసీఆర్ మాత్రం ఇంకా సమాధానం ఇవ్వలేదని, సమయం కావాలని కోరారని వివరించారు. మాజీ సీఎండీ, ప్రస్తుత సీఎండీలతో సమావేశం అయ్యామని తెలిపారు. నిన్న (సోమవారం) మాజీ సీఎండీ ప్రభాకర్ రావు, నాటి ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ చందాతో సమావేశం అయ్యామని నరసింహా రావు వివరించారు. ఎంత నష్టం అనేది తేల్చాల్సి..

కాగా మూడు నిర్ణయాలు అప్పటి ప్రభుత్వం మాత్రమే తీసుకుందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహా రెడ్డి పేర్కొన్నారు. జెన్‌కోకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఎస్కే జోషి, అరవింద్ కుమార్‌లతో ఇవ్వాళ (మంగళవారం) సమావేశం అయ్యామని చెప్పారు. అరవింద్ కుమార్ అప్పుడే రేగ్యులేటరీ కమిషన్‌కు లేఖ రాశారని, అయితే పట్టించుకోలేదని అన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినప్పుడు కేంద్రానికి అధికారం ఇవ్వాలని, అయితే రెండు రాష్ట్రాల ఒప్పందంతో ఛత్తీస్ఘడ్‌కు అధికారం ఇచ్చారని పేర్కొన్నారు. భారీగా నిధులు ఖర్చు చేసి పవర్ కొనుగోలు చేశారని, మొత్తం ప్రక్రియలో ఎంత నష్టం అనేది తేల్చాల్సి ఉందని నరసింహా రెడ్డి పేర్కొన్నారు. ఇక భద్రాద్రిలో సబ్ క్రిటికల్ టెక్నాలజీని పెట్టారని, అంతటా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ పెట్టారని నరసింహా రెడ్డి వివరించారు. యాదాద్రిలో నామినేషన్ బేస్‌లో ఇచ్చారని, ఇంకా పూర్తి కాలేదని అన్నారు. ఆగస్టు వరకు ఒక లైన్ అందుబాటులోకి వస్తుందని అంటున్నారు కానీ రైల్వేలైన్ వెయ్యలేదని పేర్కొన్నారు. అధికారుల నుంచే కాకుండా ప్రముఖులు నుంచి కూడా సమాచారం తీసుకుంటున్నామని అన్నారు.

# పెరిగిన ఆర్టీసీ బస్సు టిక్కెట్లు

హైదరాబాద్, తెలంగాణలో మరో సారి ఆర్టీసీ బస్సు చార్జీలు పెరిగాయి. హైవేలపై టోల్ చార్జీలు పెంచుతూ కేంద్రం ఇటీవల నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో జాతీయ రహదారులపై అన్ని టోల్‌గేట్లలో ఈ రుసుములు స్వల్పంగా పెరిగాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఆర్టీసీ టికెట్ చార్జీల్లో టోల్ గేట్ రుసుములు పెరిగాయి. టోల్ ప్లాజాలు ఉన్న మార్గాల్లో ప్రయాణించే ఆర్టీసీ బస్సుల్లో రూ.3 చొప్పున చార్జీలు పెరిగాయి. టోల్ గేట్లు ఉన్న రహదారుల్లో ప్రయాణించే ఆర్టీసీ బస్సులు కూడా టోల్ రుసుములు చెల్లించాల్సి ఉంది. కేంద్రం నిర్ణయంతో టోల్ గేట్ చార్జీలు పెరగడంతో ఆర్టీసీ ఆ భారాన్ని ప్రయాణికులపైనే మోపింది. టికెట్ చార్జీల్లో కలిసి ఉన్న టోల్ రుసుములను రూ.3 చొప్పున పెంచింది. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రూ.10గా ఉన్న టోల్‌రుసుమును రూ.13కు, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని, గరుడ, వజ్ర బస్సుల్లో ఉన్న రూ.13ను రూ.16కు, గరుడ ప్లస్ బస్సుల్లో రూ.14 నుంచి రూ.17కు, నాన్ ఏసీ స్లీపర్, హైబ్రీడ్ స్లీపర్ బస్సుల్లో రూ.15 నుంచి రూ.18కి, ఏసీ స్లీపర్ బస్సుల్లో రూ.20 నుంచి రూ.23కు పెంచారు. పెరిగిన ఛార్జీలు తాజాగా అమల్లోకి వచ్చాయి. ఒక్కో టోల్ గేట్‌కు రూ. 3 పెంచినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దేశ వ్యాప్తంగా టోల్ ఛార్జీలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నాయి. ఆర్టీసీ బస్సుల్లో నిత్యం 30 లక్షల మంది ప్రయాణిస్తున్నారని.. ఇందులో సిటీలో 12 లక్షల మంది, పల్లె వెలుగు బస్సుల్లో 12 లక్షల మంది జర్నీ చేస్తున్నారని తెలిపారు. వీరికి చార్జీల పెంపు భారం వర్తించదని, మిగతా 6 లక్షల మందికి మాత్రమే అదనపు భారం పడనుందని అధికార వర్గాల సమాచారం. చార్జీలు పెంచినప్పటికీ ఆయా టోల్ గేట్ల వద్ద డబ్బులు చెల్లించిన తర్వాత, ఆర్టీసీకి అదనంగా ఆదాయం వస్తుందని తెలుస్తోంది. టోల్ చార్జీలు పెరిగిన నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ అధికారులు సైతం బస్సు ఛార్జీలను పెంచి టిమ్ మిషన్లలో ఆయా మార్పులు చేశారు. అయితే, ఛార్జీల పెంపుపై ఆర్టీసీ ఎలాంటి ప్రకటనా ఇవ్వకపోవడం గమనార్హం. ఛార్జీలు పెంపుపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. దీంతో వారిపై ఎలాంటి భారం పడే అవకాశం లేదు. ఇప్పుడు ఎటొచ్చి ఆ భారాన్ని మోయాల్సిందల్లా పురుషులు మాత్రమే.

# మంథని ఎంపివో ఆరిఫ్ పై వేటు

## -విచారణలో వెలుగుచూసిన వేధింపులు, ఆర్థిక నేరాలు



పెద్దపల్లి ప్రతినిధి: మంథని మండల ప్రజా పరిషత్ కార్యాలయ మండల పంచాయతి అధికారి మొహమ్మద్ ఆరిఫ్ హుస్సేనుపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ వేటు వేశారు. ఆరిఫ్ ను విధుల నుండి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ పంచాయతీరాజ్ అండ్ రూరల్ ఎంప్లాయిమెంట్ హైదరాబాదు కార్యాలయానికి సరెండర్ చేశారు. ఏడాదికాలంగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, క్రిందిస్థాయి ఉద్యోగులను ఎంపివో వేధిస్తున్నాడని ఆరోపిస్తూ ఉద్యోగులు ఇటీవల జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద నిరసన చేపట్టి కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ విచారణ అధికారిగా జడ్పీ సీఈవోను నియమించి నివేధిక సమర్పించవలసినది ఆదేశించారు. జడ్పి సీఈఓ విచారణలో ఆరిఫ్ పై వచ్చిన ఆరోపణలు నిజమని తేలింది. మహిళా పంచాయతి కార్యదర్శుల పట్ల అనుచితంగా వ్యవహరించడం, వేధించడం, అక్రమ ఆర్థిక లావాదేవీలకు పాల్పడటం, విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడం, ఆర్థిక దోపిడికి సహకరించాలంటు ఉద్యోగులను భయాందోళనల్కు గురిచేయడం, ఉద్యోగులను వ్యక్తిగత డ్రైవర్లుగా వాడుకోవడం, ఉద్యోగుల కుటుంబ సభ్యులను అవమానిచడం వంటి అనేక అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడ్డట్టు విచారణలో తేలడంతో ఏంపివో విధులకు ఆరిఫ్ పనికిరాడంటూ నివేధికలు కలెక్టరుకు సమర్పించారు. ఆరిఫ్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టరు అతడిని విధుల నుండి తప్పించారు.

# ఉపాధ్యాయులను అభినందించిన కలెక్టర్

సిద్దిపేట: దుద్దెడ జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట మరియు పాఠశాల పునఃప్రారంభం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మను చౌదరీ ముఖ్యఅతిథిగా హాజరైయారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్ మరియు పాఠ్య మరియు నోట్ బుక్కులను అందజేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా ప్రొఫెసర్ జయ శంకర్ మడిబాట కార్యక్రమం ద్వారా దుద్దెడ జిల్లా పరిషత్ హై స్కూల్ లో ప్రైవేటు పాఠశాలలు మరియు ఇతర పాఠశాలలో చదువు తున్న 66 మంది విద్యార్థులను చేర్పించినందుకు మరియు 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు.

జిల్లా వ్యాప్తంగా 814 ప్రభుత్వ స్కూళ్లలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా విద్యుదీకరణ, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదులు, కిచన్ షెడ్ల మరమ్మత్తు, త్రాగునీరు వసతి ఏర్పాటు తదితర పనులను 35 కోట్ల రూపాయలతో చేపట్టడం జరిగిందని మరో వారం, పదిహేను రోజులలో పనులు పూర్తయితాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో డీఎస్సీ ద్వారా ఉద్యోగాన్ని సాధించిన అత్యున్నత అర్హతలు గల ఉపాధ్యాయుల విద్యా బోధన చేస్తారని అలాగే ఉచితంగా రెండు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలను నోటు పుస్తకాలను అందించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చదివించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. తాను కూడా మంచిర్యాల జిల్లాలోని దేవపూర్ అనే మారుమూల గ్రామంలో చదువుకు న్నానని క్రమశిక్షణ శ్రద్ధతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పిన విధంగా చదువుకుంటే ఉన్నతంగా ఎదగవచ్చని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు చదువుతోపాటు కో కరీక్యులర్ యాక్టివిటీస్ లో శిక్షణ ఇవ్వాలని అన్నారు. విద్యార్థులకు సబ్జెక్టు పరిజ్ఞానంతో పాటు ఏదైనా సాధించగలమనే మానసిక దృఢత్వాన్ని పాఠశాల స్థాయి నుండే కల్పించాలని అన్నారు. బాల బాలికలు తేడా అందర్నీ చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ విద్యా సంవత్సరం కూడా పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డిపిఓ దేవకీదేవి, ఎంఈఓ, ఎంపీడీవో, ఎంపీపీ, పాఠశాల హెచ్ఎం లక్ష్మి ఉపాధ్యాయుల తదితరులు పాల్గొన్నారు.

# రద్దు చేసిన ఐటీఐఆర్ ను పునరుద్ధరించాలి

## పిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి

హైదరాబాద్: రద్దు చేసిన ఐటీఐఆర్ ను పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గాంధీ భవన్ లో మీడియా సమావేశ లో మాట్లాడుతూ కేంద్ర మంత్రులైన కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం పది ఏండ్ల నుండి విభజన చట్టంలోని హామీలను నెరవేర్చలేదు ఈ సారి మీరు కుంటి సాకులు చెప్పకుండా విభజన హామీలు నేరవీర్చాలని కోరారు. లేదుపేపరుకే పరిమితమైన పసుపు బోర్డును, సమ్మక్క సారక్క ట్రైబల్ యూనివర్సిటీ కి జూన్24 న ఉన్న కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని కోరారు..తన నియోజకవర్గం గుండా వెళ్లే మూసి నది ప్రక్షాళన కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరారు. అగ్నిపథ్ కు వ్యతిరేకంగా కొట్లాడిన విద్యార్థిని బిజెపి, బీఆర్ ఎస్ పొట్టన బెట్టుకుంది. తెలంగాణ బిడ్డల పైన పెట్టిన అక్రమ కేసులని కేంద్ర సహాయక హోం మంత్రిగా ఉన్న బండి సంజయ్ వెంటనే ఉపసంహరించాలి. మోడీ వైఫల్యాలను కేసీఆర్ ఏనాడు ఎండగట్టలేదు తెలంగాణ ప్రజల చెవులో పూలు పెట్టిన పరిస్థితులు ఇక నుండి సాగనియ్యమన్నారు. బీజేపీ వైఫల్యాలను ప్రతి రోజు ఎండగడతాం. మీరు కేంద్రానికి మంత్రులే కాదు తెలంగాణ బిడ్డలను మరవద్దన్నారు.

# ఎంఆర్ సి భవనం నుండి ఎంపిపి కార్యాలయాన్ని ఖాళీ చేయండి

## తహశీల్దార్ కు, ఎంపిడివో లకు విడిసి, ఎండిసి ల విజ్ఞప్తి

## విద్యా ప్రాంగణంలో రాజకీయ కార్యాలయం

## పిల్లలకు,మహిళలకు కలుగుతున్న ఇబ్బందులు

## అంగన్ వాడీ కేంద్రం ఎదుటే... రాజకీయాల అడ్డ

## మద్యం ప్రియులు, గంజాయి ప్రియులతో పొంచి ఉన్న

జగిత్యాల/ జగిత్యాల జిల్లా లోని బుగ్గారం మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా, అక్రమంగా ఎమ్మార్సీ భవనాన్ని కబ్జా చేసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎంపిపి, ఎంపిడివో, ఎంపీవో కార్యాలయాన్ని తక్షణమే ఖాళీ చేయాలని బుగ్గారం మండల అభివృద్ధి కమిటి అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటి అధ్యక్షులు నక్క చంద్రమౌళి లు స్థానిక తహశీల్దార్ కు, ఎంపిడివో కు విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు స్వయంగా తహశీల్దార్ మాజీద్, ఎంపిడివో మాడిషెట్టి శ్రీనివాస్ లను కలిసి విజ్ఞాపన పత్రాలు అందజేసి, వాస్తవ పరిస్థితులను వివరించారు. గతంలో అద్దె భవనంలో ఉన్న ఎంపిపి కార్యాలయాన్ని రాజకీయంగా ఎమ్మార్సీ భవనం పై కన్ను పడి కబ్జా చేసి అక్రమంగా ఆక్రమించుకున్నారని వారు ఆరోపించారు. ఉన్నతాధికారుల నుండి గానీ, ప్రభుత్వం ద్వారా గానీ ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా కబ్జా చేసి ఎంఆర్ సి భవనంలో ఎంపిపి కార్యాలయాన్ని కొనసాగించడం ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులకు, నాయకులకు తగదన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అంగన్ వాడీ కేంద్రానికి ఎదురుగా గల ఎమ్మార్సీ భవనంలో ఎంపిపి కార్యాలయం కొనసాగడం వలన రాజకీయ నాయకుల, కార్యకర్తల అడ్డాలు, ఇదే సాకుగా భావించి మద్యం ప్రియులు, గంజాయి ప్రియులు కూడా అక్కడే అడ్డాలు వేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని వారు వివరించారు. వీటి వలన పాఠశాలలోని ఆడ పిల్లలకు, మహిళా టీచర్లకు, ఆంగన్ వాడీ టీచర్లకు, పిల్లల తల్లులకు, అంగన్ వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణీలకు, మహిళలకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని వారు పేర్కొన్నారు. మద్యం ప్రియులు, గంజాయి ప్రియులు, ఆకతాయిలు, ప్రవర్తన సరిగా లేని కొందరు రాజకీయ నాయకుల వలన అనుకోని సంఘటనలు జరిగే ప్రమాదం కూడా పొంచి ఉందని వారు తహశీల్దార్ మాజిద్, ఎంపిడివో శ్రీనివాస్ లతో ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పాఠశాల ప్రాంగణంలో గల ఎమ్మార్సీ భవనం నుండి ఎంపిపి కార్యాలయాన్ని ప్రైవేట్ అద్దె భవనంలోకి లేదా గత కొన్ని ఏండ్లుగా ఖాళీగా ఉన్న సిరివంచ కోట బాపతు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోకి లేదా, దాని ప్రక్కనే ఖాళీ ఉన్న అంగన్ వాడీ భవనం లోకి మార్చాలని వారు సూచించారు. గతంలో కూడా అధికారుల దృష్టికి, నాయకుల దృష్టికి తీసుకు వెళ్ళినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా తక్షణమే ఈ కార్యాలయాన్ని ఖాళీ చేయక పోతే ఆడపిల్లల, మహిళల రక్షణ కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి ఆందోళన కార్యక్రమాలు కూడా చేపడుతామని వారు పేర్కొన్నారు.

# వలస కార్మికుల పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలి

## పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

## పని ప్రదేశాల్లో వలస కార్మికులకు కనీస వసతుల కల్పన

## ఇటుక బట్టీలలో పని చేస్తున్న కార్మికుల పిల్లల ఆడిట్ నిర్వహణ




పెద్దపల్లి ప్రతినిధి: జిల్లాలోని వివిధ వాణిజ్య వ్యాపార రంగాలలో పనిచేస్తున్న వలస కార్మికుల పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఇటుక బట్టీలు, హోటల్స్, ఇతర వాణిజ్య వ్యాపార సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో చిన్నపిల్లలను పనిలో చేర్చుకోవడానికి వీలులేదని, బాలకార్మిక నిరోధ చట్టాన్ని వాణిజ్య వ్యాపార ప్రతినిధులు తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. మన జిల్లాలో ఉన్న అన్ని ఇటుక బట్టిలను తనిఖీ చేసి వలస కార్మికుల పిల్లలకు సంబంధించి ఏజ్ గ్రూప్ వారీగా ఆడిట్ నిర్వహించి రిపోర్ట్ సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. వలస కార్మికుల పిల్లలను వెంటనే సమీపంలో గల అంగన్వాడీ కేంద్రం లేదా ప్రభుత్వ పాఠశాలలో తప్పనిసరిగా జాయిన్ చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వలస కార్మికుల పిల్లల పూర్తి బాధ్యత సదరు యాజమాన్యాలు తీసుకోవాలని, మన రాష్ట్రంలో ఉన్నంతవరకు వారికి పౌష్టికాహారం అందించడం, మంచి విద్య అందించడం మన బాధ్యతని, దీనిని ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పని ప్రదేశంలో వలస కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, కార్మిక చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, వేధింపులు జరగకుండా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సిఐ కృష్ణ మాట్లాడుతూ వ్యాపార వాణిజ్య యజమానులు తమ దగ్గర పని చేసే కార్మికులకు కనీస మౌళిక వసతులు కల్పించాలని అన్నారు. వలస కార్మికులు తీసుకుంటున్న ఆహారంపై శ్రద్ధవహించాలని, రాబోయే సీజన్లో పౌష్టికాహారం లేక వీరోచనాలు, వాంతులతో వలస కార్మికులు అనారోగ్యం పాలు కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మన దగ్గర పనిచేసే కార్మికుల యోగక్షేమాలు మన బాధ్యతగా పరిగణించాలని, కార్మికుల చట్టం ప్రకారం వారికి అవసరమైన మందులు ఉచితంగా అందించాలని, పని ప్రదేశంలో కనీస వసతులు ఉండాలని, వారికి ప్రత్యేకంగా టాయిలెట్స్ ఉండాలని, ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే చికిత్స చేసేందుకు పని ప్రదేశంలో ప్రథమ చికిత్స కిట్ ఏర్పాటు చేయాలని అన్నారు. కార్మికుల రవాణా సమయంలో సైతం నిబంధనలు పాటించాలని, పని ప్రదేశాలలో మైనర్లను ఎట్టి పరిస్థితుల్లో విధులలో చేర్చుకోవద్దని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, డిసిపిఓ కమలాకర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రామ్మోహన్, సంబంధిత అధికారులు, ఇటుక బట్టీలు, హోటల్, కిరాణ, క్లాత్ స్టోర్స్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

## శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస రెడ్డి

## బడి బాట సందర్భంగా విద్యార్థులకు ఉచిత యూనిఫాం,నోట్ పుస్తకాలు,పాఠ్య పుస్తకాలు పంపిణీ

మహబూబ్ నగర్;రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగం కు అత్యంత ప్రాధాన్యత నిస్తోందని శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్ నగర్ పట్టణం లో షాషాబ్ గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రొపెసర్ జయ శంకర్ బడి బాట కార్యక్రమం లో బాగంగా పాఠశాలలు ప్రారంభం రోజున విద్యార్థినీ,విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం,పాఠ్య పుస్తకాలు,నోట్ బుక్ లు పంపిణీ కార్యక్రమం లో మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ తో కలిసి ఉచిత ఉచితంగా యూనిఫాం,పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్ లు విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం లో ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని మంచి ఆలోచన తో,సంకల్పం తో అమ్మ ఆదర్శ పాఠశాలల. కమిటీ ల ద్వారా వేసవి సెలవుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ లు,త్రాగు నీరు,రిపేర్ లు,డ్యూయల్ డెస్క్ లు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పిల్లల భవిష్యత్ ను దృష్టి లో ఉంచుకొని ఈ కార్యక్రమం చేపట్టడం నిశ్శబ్ద విప్లవం గా అభివర్ణించారు. పాఠశాలలు ప్రారంభం కాగానే మహిళా సంఘాల వి. ఓ.లు ద్వారా దుస్తులు కుట్టి విద్యార్థినీ,విద్యార్థులకు యూనిఫాం అందించడం పట్ల వారిని అభినందించారు. బడి ప్రారంభం రోజునేవిద్యార్థులకు ఉచితంగా యూనిఫాం, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు పంపిణీకి శ్రీకారం చుట్టడం అద్భుతమని కొనియాడారు. ఇంకా రాష్ట్రం ప్రభుత్వం ద్వారా అద్భుతాలు జరగబోతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం లో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేక యువత నిర్వీర్యం చెందారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా,వైద్య, ఉపాధి, ఉద్యోగ రంగాలపై దృష్టి పెట్టిందని, భవిష్యత్ తరాలు బాగుండాలని కార్యక్రమాలు చేపట్టి ముందుకు పోతుందన్నారు. ఉపాధ్యాయులు నూతన పద్ధతులతో విద్యార్థులకు పాఠ్య బోధన అందించాలని అన్నారు. విద్యా రంగం లో రాష్ట్రం ను దేశం లోనే ప్రథమ స్థానం లో ఉంచేందుకు ఉపాధ్యాయులు సహకారం అందించాలని అన్నారు. విద్యార్థులు విద్యా తో పాటు, క్రీడలలో పాల్గొనాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన సౌకర్యాలు ఉపయోగించుకొనిప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులతో పోటీ ప్రపంచంలో టాపర్స్ గా నిలువాలని అన్నారు. జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సత్ సంకల్పంతో వేసవి సెలవుల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ,గ్రామీణ ప్రాంతం లలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు విద్యుదీకరణ,మైనర్ రిపేర్ లు,కాంపౌండ్ వాల్,టాయి లెట్ లు వాడుక లో తీసుకు రావడం,బాలికల టాయిలెట్ నిర్మాణం,పెయింటింగ్ పనులు చేపట్టి నట్లు తెలిపారు. జిల్లాలో 642 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ల ద్వారా మౌలిక సౌకర్యాలు పనులు చేపట్టినట్లు,మొదటి దశ లో 490 పాఠశాల ల్లో,రెండవ దశలో 152 పాఠశాలల్లో పనులు చేపట్టినట్లు తెలిపారు. మొదటి దశలో చేపట్టిన పనులు 85 శాతం పూర్తి కాగా, రెండవ. దశలో పనులు ప్రగతి లో నున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభం కాగానే విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం,పాఠ్య పుస్తకాలు,నోట్ బుక్స్,ప్రాథమిక తరగతుల విద్యార్థులకు వర్క్ బుక్ ప్రజా ప్రతినిధుల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల ద్వారా విద్యార్థులకు దుస్తులు కుట్టి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బడి బాట కార్యక్రమం లో బాగంగా బడి బయట ఉన్న,బడి మాని వేసిన విద్యార్థుల వివరాలు,తల్లి దండ్రుల వివరాలు ఉపాధ్యాయులకు తెలిపితే విద్యార్థినీ,విద్యార్థులు,తల్లి దండ్రులతో మాట్లాడి బడి లో చేర్పిస్తారని అన్నారు. జీవితం లో స్థిర పడడానికి, ఉద్యోగం లో గాని,వ్యాపారం లో గాని,నచ్చిన రంగం లో రాణించడానికి చదువు ప్రతి ఒక్కరికీ అవసరం అన్నారు. విద్యార్థులు బాగా వందువుకొని తల్లి దండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని కలెక్టర్ ఉద్బోధించారు .ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్,వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్,జిల్లా విద్యా శాఖ అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు



సూర్యాపేట జిల్లా: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నాలుగవసారి ప్రమాణ స్వీకారం చేయుచున్న సందర్భంగా కోదాడ రూరల్ మండలం గుడిబండ గ్రామంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి కి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు మాట్లాడుతూ, పార్టీలు వేరైనా లక్షల మంది గుండెల్లో నందమూరి తారక రామారావు అభిమానం కలదు అన్నారు . కోదాడ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఓరుగంటి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు బడుగు బలహీన వర్గాలకు రాజకీయ చైతన్యం నేర్పింది , సంక్షేమ పథకాలను ప్రారంభించింది ఎన్టీ రామారావు అన్నారు. నారా చంద్రబాబునాయుడు పాలనలో బీసీలకు రాజ్యాధికారము కల్పించినారు. తెలంగాణ రాష్ట్రం ధనిక రాష్ట్రంగా ఆవిర్భవించింది అంటే దానికి చంద్రబాబు నాయుడు హైదరాబాదు నగరాన్ని సాఫ్ట్ వేర్ రంగం ను శిఖరాగ్రంగా ఉంచడమే కారణం. చిలుకూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సాతులూరి గురవయ్య మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి ఆంధ్ర రాష్ట్ర కంటే తెలంగాణ రాష్ట్రంలోనే బలమైన కార్యకర్తల కలరనీ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కోదాడ సహకార సంఘం అధ్యక్షురాలు ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి రమాదేవి,మట్టా కృష్ణారెడ్డి, గునుగుంట్ల శ్రీనివాసరెడ్డి, సోమపొంగు బిక్షం, ఓరుగంటి రామకృష్ణ,వీర్ల లక్ష్మారెడ్డి, నర్సింబోతు గీత . విరగాని రామకృష్ణ ,రాజుల లింగయ్య,కందరబోయిన శ్రీను, మునగా వెంకటేశ్వర్లు,చారి.పల్లా సైదులు, పాషా తదితరులు పాల్గొన్నారు.

# స్కూలు బస్సులపై ఆర్టీయే తనిఖీలె

రంగారెడ్డి: నగర శివారు రాజేంద్రనగర్ లో స్కూల్ బస్సు ల పై ఆర్టీయే అధికారులు సోదాలు నిర్వహించారు. పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులను రవాణా చేసే స్కూల్ బస్సు లపై ఫోకస్ పెట్టారు. ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్, ఫయర్ సేఫ్టి కిట్, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ లను క్షణంగా రవాణా అధికారులు తనిఖీలు చేసారు. పలు బస్సులురంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులు సీజ్ చేసారు.

# ప్రతి రోజూ పాఠశాలల్లో విద్యార్థులకు స్పోర్ట్స్ పీరియడ్, లైబ్రరీ ఉండేలా చర్యలు

**-పాఠశాల గేట్ ఏర్పాటుకు 50 వేల రూపాయల చెక్కు అందజేత**

**-పాఠశాలకు విద్యార్థులు రెగ్యులర్ గా హాజరు కావాలి**

**-విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత అంశంలో రాజీపడవద్దు**

**-జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాఘవాపూర్ వేసవి సెలవుల అనంతరం పునః ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**



పెద్దపల్లి ప్రతినిధి: ప్రతిరోజూ పాఠశాలల్లో విద్యార్థులకు స్పోర్ట్స్ పీరియడ్, లైబ్రరీ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా సందర్శించారు. పాఠశాలకు విచ్చేసిన జిల్లా కలెక్టర్ కు ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పాఠశాలను ఆసాంతం పరిశీలించిన కలెక్టర్ అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపట్టిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో న్యూట్రి గార్డెన్ ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలని అన్నారు. పాఠశాల కిచెన్ షెడ్ ను పరిశీలించిన కలెక్టర్ మధ్యాహ్న భోజన కార్మికులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. పాఠశాలకు వచ్చే బియ్యం నాణ్యతను పరిశీలించి తీసుకోవాలని, నాణ్యమైన బియ్యం రాని పక్షంలో వెంటనే తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అనుగుణంగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, టాయిలెట్లలో టైల్స్ వేయాలని, వాటిని పకడ్బందీగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రాత్రి పూట పాఠశాల వద్ద ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని, దీనికి గ్రామ పెద్దల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విద్యార్థులతో ముచ్చటించారు. సమ్మర్ హాలిడేస్ ఎలా గడిపారంటూ విద్యార్థులను ప్రశ్నించారు. మన జీవిత స్థాయిని, జీవన విధానాన్ని విద్య మాత్రమే మార్చగలుగు తుందని, మన పూర్వపు తరాల వారికి రాని అవకాశం మనందరికీ వచ్చిందని, మనకు అందిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ రోజూ చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు పాఠశాలకు రెగ్యులర్ గా హాజరుకావాలని, చిన్నతనం నుంచి మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవాలని, బయట జంక్ ఫుడ్ తినవద్దని, ప్లాస్టిక్ వస్తువులలో ఇచ్చే ఆహారం ఎట్టి పరిస్థితుల్లోనూ తినవద్దని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని,జీవితంలో మొట్ట మొదటి పబ్లిక్ పరీక్షలు పదవ తరగతిలో ఎదుర్కొంటామని, మంచి మార్కులతో ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని, టీచర్లు చెప్పే పాఠాలు శ్రద్ధగా వినాలని, మన స్నేహితులు పాఠశాలకు రెగ్యులర్ గా రాని పక్షంలో వారి వెంటపడి రెగ్యులర్ గా వచ్చేలా చూసుకోవాల్సిన బాధ్యత కూడా మనపై ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాలల్లో ఇకనుంచి ప్రతి రోజు స్పోర్ట్స్, లైబ్రరీ పీరియడ్ ఉండేలా చర్యలు తీసుకున్నామని, విద్యార్థులు ప్రతిరోజు కొంత సమయాన్ని క్రీడలు ఆడటానికి కేటాయించాలని, లైబ్రరీ పీరియడ్ సమయంలో మంచి పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గేటు లేదని, పాఠశాల ఆవరణలో పశువులు సంచరిస్తున్నాయని, గేటు ఏర్పాటు చేయాలని విద్యార్థి కోరగా, వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ గేటు ఏర్పాటుకు ఎంత ఖర్చు అవుతుందో తెలుసుకొని దానికి అవసరమైన 50 వేల రూపాయల చెక్కును కలెక్టర్ ప్రధానోపాధ్యాయులకు అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.

# కువైట్‌లో ఘోర ప్రమాదం35 మంది మృతి



న్యూ డిల్లీ: కువైట్‌లో ఘోర ప్రమాదం జరిగింది. దక్షిణ మంగాఫ్ జిల్లాలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో దాదాపు 35 మంది మృతి చెందినట్లు ప్రభుత్వ ఆధ్వర్యంలోని కువైట్ న్యూస్ ఏజెన్సీ (కునా) వెల్లడించింది. కార్మికులు నివాసం ఉంటున్న భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి పెద్ద ఎత్తున వ్యాపించాయి. భవనంలో మంటలు వేగంగా వ్యాపించడంతో చాలా మంది లోపల చిక్కుకున్నారు. ఈ ప్రమాదంలో ఐదుగురు కేరళీయులు మరణించినట్లు నివేదికలు వెల్లడించాయి.“దట్టమైన పొగతో ఊపిరాడక చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 40మందికి పైగా స్పృహ తప్పి పడిపోయారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అందుపు చేశారు. భవనంలో చిక్కుకున్న వారిని రక్షించి బయటకు తీసుకొచ్చారు. తీవ్రంగా గాయపడినవారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు” అని సీనియర్ పోలీసు కమాండర్ తెలిపారు. అగ్నిప్రమాదం కారణంగా 43 మంది ఆసుపత్రి పాలయ్యారని, వారిలో నలుగురు మరణించారని కువైట్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. పోలీసులు చెప్పిన 35 మరణాలకు అదనంగా నలుగురి మరణాలు ఉన్నాయా? అనేది స్పష్టంగా తెలియలేదు. మంటలను అదుపు చేశామని, ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు.

# ఇచ్చిన మాట ప్రకారం ఉపాధ్యాయ ఖాళీలు నింపాలి

సిద్దిపేట: పాఠశాలల ప్రారంభం నేపథ్యంలో సిద్దిపేట ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులకు బుక్స్ యూనిఫామ్స్ మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు స్థానిక ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 వేలకు పైన పాఠశాలలు పునర్ ప్రారంభం అవుతున్న సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చినప్పుడు వారి జీవితం మారుతుంది. ప్రజా ప్రతినిధిగా మేము, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపినప్పుడే వారికి మంచి జరుగుతుంది. రాష్ట్రం లో గత ఐదు సంవత్సరాలుగా సిద్దిపేట జిల్లా పదో తరగతి ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిచింది. అభివృద్ధిలో విద్యలో ఏ రంగంలో అయినా సిద్ధిపేట జిల్లా రాష్ట్రంలో అగ్రగామిగా నిలుస్తూ వస్తున్నది. సిద్ధిపేటలో ఉన్నటువంటి అన్ని ప్రభుత్వ పాఠశాల మెరుగైన వసతులతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుకున్నాము. ఈ పాఠశాలలో హాస్టల్ కి వెంటనే డైనింగ్ రూమ్ మంజూరు చేయించుకొని ప్రారంభించుకుంటామని హామీ ఇస్తున్నాను. సిద్దిపేట ప్రభుత్వ పాఠశాలలకు ఏ అవసరం ఉన్న ప్రజా ప్రతినిధిగా ప్రభుత్వం నుండి, దాతల సహకారంతో వసతులను ఏర్పాటు చేస్తాం. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కూడా మన ఊరు మనబడి కార్యక్రమాన్ని కొనసాగించి ప్రభుత్వ పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నాను. కొత్తగా వచ్చిన ప్రభుత్వం అన్ని ప్రభుత్వం స్కూళ్లలో ఇచ్చిన మాట ప్రకారం పారిశుద్య సిబ్బందిని ఉచిత కరెంటు ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరుతున్నాను. డీఎస్సీలో 25 వేల ఖాళీలు నింపుతామని చెప్పి 11వేల ఖాళీలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే 25 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు నింపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. స్కూలు ప్రారంభమైన సందర్భంగా వర్షాకాలంలో వచ్చే సమస్యలను దృష్టిలో ఉంచుకొని పాఠశాలలో మరమ్మతు చర్యలు వెంటనే చేపట్టాలని కోరుతున్నాను. తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి. కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్య అందుతున్నది. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించే బాధ్యత తీసుకోవాలి. క్రమం తప్పకుండా పాఠశాలకు పంపే విధంగా కృషి చేయాలి. తల్లిదండ్రుల ఆలోచనకు అనుగుణంగా గత ప్రభుత్వం గవర్నమెంట్ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి విద్యార్థులకు మెరుగైన విద్య అందించింది. కాబట్టి విద్యార్థులు తెలుగు మీడియంలోనే కాకుండా, ఇంగ్లీష్ మీడియం చదువుకునే అవకాశం ఉంది కాబట్టి తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి. సిద్దిపేట బాలుర ప్రభుత్వ పాఠశాలలో 98 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు మీ అందరికీ అభినందనలు.. అదేవిధంగా ఈ సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాదించడానికి మీరందరూ కృషి చేయాలని కోరుతున్నాను. సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు నా వంతు కృషి నిత్యం ఉంటుంది. గత సంవత్సర సిద్దిపేట జిల్లా పదో తరగతి ఫలితాల్లో రెండో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మొదటి స్థానంలో నిలవాలి. అందుకు అందరం కృషి చేయాలి. సిద్దిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నా సొంత ఖర్చు 5 లక్షలతో గత ఏడాది స్నాక్స్ అందించడం జరిగింది. నిరంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అభివృద్ధి కోసం కృషి చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

# నీరు, విద్యుత్ విషయంలో కాంగ్రెస్ విఫలం

సూర్యాపేట -విద్యుత్ కొనుగోళ్ళు, కాళేశ్వరం ప్రోజెక్టుల విచారణపై మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి స్పందించారు. విచారణ కమిషన్లు వాటి పని అవి చేసుకుంటాయి. ప్రభుత్వం ఎందుకు లీకులు ఇస్తుంది..? కాళేశ్వరంలో నీళ్ళు నిలిపి సాగునీరు అందించకుండా తప్పు చేస్తున్నారు. నీళ్ళు, విద్యుత్ విషయంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైంది. పత్తి విత్తనాల కొరతలో ప్రభుత్వ పెద్దల పాత్ర ఉంది. పత్తి విత్తనాల బ్లాక్ దందాలో ఓ మంత్రి పాత్ర ఉంది. ఆధారాలు రాగానే త్వరలో పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడిస్తాం. కమిషన్ల విచారణ పేరుతో రైతు రుణమాఫీపై దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్ ప్రయత్నమని ఆరోపించారు

# ఆరు నెలలైనా హామీలు అమలు చేయడం లేదు


**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏలేటి మరో బహిరంగ లేఖ**

**లోక్ సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ను తిరస్కరించారు**

**తక్షణమే హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలి**

**రుణమాఫీకి డేట్ ఇచ్చినట్లే మిగతా హామీలకు డేట్స్ ఇవ్వాలి**

**బిజెపి శాసన సభా పక్షం నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్**



హైద్రాబాద్ ;సిఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టి ఆరు నెలలైంది.... లోకసభ ఎన్నికల కోడ్ కూడా ముగిసింది ... ఇకనైనా సాకులు మాని, మీరు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రధాన హామీలను ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలు చేస్తామని పిసిసి చీఫ్ గా రేంత్ రెడ్డి మాటిచ్చారని, ఇప్పుడు ఆ మాటను మరచిపోయారని గుర్తు చేశారు.రేవంత్ రెడ్డి సిఎంగా బాధ్యతలు చేపట్టిన 99 రోజులకు పార్లమెంటు ఎన్నికల షెడ్యూలు వెలువడడంతో ఎలక్షన్ కోడ్ కారణంగా హామీల అమలు సాధ్యపడడం లేదని మీరు చెప్పుకుంటూ ఇన్నాల్లు తప్పించుకున్నారు. ఇపుడు ఎన్నికల కోడ్ ముగిసింది. మీరు అధికారంలోకి వచ్చి కూడా ఆరు నెలలైంది. కానీ మీరు ఇచ్చిన 420 హామీల్లో ప్రధాన అంశాలు మాత్రం ఎప్పటి నుంచి అమలు చేస్తారనే స్పష్టత ఇవ్వకపోవడమంటే మీకు ఓట్లు వేసి, అధికారాన్ని అప్పగించిన ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. రైతులకు రెండు లక్షల రూపాయల వరకున్న పంటరుణాలను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2023 డిసెంబర్ 9వ తేదీనే ఏక కాలంలో మాఫీ చేస్తామన్న మాటను నిలబెట్టుకోకుండా మాట తప్పి అన్నదాతలను మోసం చేశారు. దాంతో లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతోందని గ్రహించి ఎలక్షన్ కోడ్ ను ఉల్లంఘిస్తూ రుణ మాఫీ హామీ అమలును ఆగస్టు 15కు వాయిదా వేసి రైతన్నల నమ్మకాన్ని కోల్పోయారు. ఫలితంగా లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ భంగపడింది. 64 మంది ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ 8 ఎంపీ సీట్లు గెలిస్తే ... ఎనిమిది మంది ఎమ్మెల్యేలున్న బిజెపి కూడా 8 లోకసభ సీట్లను గెలుచుకుంది. అంటే ప్రజలు కాంగ్రెసును తిరస్కరించినట్లే కదా. లోకసభ ఎన్నికలు మీ ప్రభుత్వ వంద రోజుల పాలనకు రెఫరెండం అని మీరే ప్రకటించారు. అంటే ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా మోసం చేస్తున్న మీ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించినట్టే కదా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని నిలదీశారు. ప్రధానంగా రైతులతో పాటు వ్యవసాయ కార్మికులు, మహిళలు, యువత, నిరుద్యోగుల వంటి పలు వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు జాడే కనిపించడం లేదని మహేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్, చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్, కామారెడ్డి బీసీ డిక్లరేషన్లలో ఇచ్చిన హామీల మాటేంటి. వ్యవసాయం - రైతు సంక్షేమం, నీటిపారుదల, యువత - ఉపాధి కల్పన, విద్యారంగం, వైద్యరంగం, గృహ నిర్మాణం, రెవెన్యూ, పౌరసరఫరాలు, పంచాయతీరాజ్- గ్రామీణాభివృద్ధి, పారిశ్రామిక రంగం, మహిళా శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీ వర్గాల సంక్షేమం, కార్మిక వర్గ సంక్షేమాలపై కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలేనా ముఖ్యమంత్రి గారూ... ఈ వాగ్దానాలను ఎలా అమలు చేయాలనే అంశంపై సిఎంగా మీరు అధికారులతో కనీస కసరత్తు కూడా చేస్తున్నట్టు కనిపించడం లేదు. ఇది హామీల ఎగేవత ధోరణి కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అభయ హస్తం మేనిఫెస్టో ఛాప్టర్ - 2, ఆరు గ్యారంటీల కార్డులో మొదటిది మహాలక్ష్మీ స్కీము ... మహిళలకు ప్రతి నెల రూ.2500. రెండో అంశంగా - రైతు భరోసా ప్రతి ఏటా అని హామీ ఇచ్చారు. రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. వీటిని ఎప్పటి నుంచి అమలు చేస్తారు. వరి క్వింటాలుకు రూ. 500 బోనస్ కేవలం సన్న వడ్లకే అంటూ మెలిక పెట్టి అన్నదాతలను మోసగిస్తున్నారు. ఈ వరికి బోనస్ హామీని బోగస్ చేసిన విధంగానే మిగిలిన వాగ్దానాలను కూడా ఏదో మెలికలు, షరతులు విధించి నీరు గార్చాలని చూస్తే మాత్రం బిజెపి సహించదని, ప్రజల తరపున నిలబడి ఇచ్చిన హామీల అమలుకు పోరాడుతామని మహేశ్వర్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కాంగ్రెస్ అభయ హస్తం మేనిఫెస్టో ఛాప్టర్ - 2, ఆరు గ్యారంటీల కార్డులో ఐదో అంశంగా యువ వికాసం పేరుతో విద్యార్థులకు రూ. ఐదు లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూలు, ఇక ఆరో అంశంగా చేయూత పథకం కింద పింఛన్లను నెలకు రూ.4000 కు పెంచుతామన్నారు కదా ... మరి ఏమైంది? పాపం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులంతా తమ పెన్షన్ల మొత్తాన్ని ఎప్పుడు పెంచుతారని నిరీక్షిస్తున్నారు. యువతకు ఇచ్చిన హామీల అమలుపై కూడా అధికారులు, మంత్రులతో సిఎం ఎందుకని కసరత్తు చేయడం లేదు? నిరుద్యోగ యవతకు 2024 ఫిబ్రవరి ఒకటో తేదీన గ్రూపు వన్ నియామకాలన్నారు. 2024 ఏప్రిల్ ఒకటిన గ్రూపు - 2 నియామకాలన్నారు. ఏమైంది? నిరుద్యోగ భృతి ప్రతి నెలా రూ.4000 ఇస్తామన్నారు. యువ మహిళా సాధికారత పేరుతో 18 ఏళ్లకు పైబడిన వారిలో చదువుకుంటున్న యవతులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటర్లు పంపిణీ చేస్తామన్నారు. మరి వీటి అమలుకు సంబంధించిన కసరత్తేది... అధికారులతో మీటింగులేవి సిఎం గారు. రుణ మాఫీ మాదిరే ఈ హామీలను కూడా ఎప్పటి నుంచి అమలు చేస్తారో ఎందుకు చెప్పడం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. వాగ్దానాల అమలు కార్యాచరణపై కసరత్తు లేకపోవడంతో, కాంగ్రెస్ ఎని సర్కారు ఇచ్చిన హామీలను ఎగ్గొడుతుందనే అనుమానాలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. ప్రజల అనుమానాలు నివృత్తి చేసేలా హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాల్సిన బాధ్యతల నుంచి ముఖ్యమంత్రి తప్పించుకోలేరని చెప్పారు. సీఎం క్యాంప్ ఆఫీసులో ప్రతిరోజు ప్రజా దర్బారు అన్న హామీ అటకెక్కింది. ప్రజా దర్బార్ మొక్కుబడి తంతుగా సాగుతోంది. బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో జరిగిన కాళేశ్వరం కుంభకోణంపై న్యాయవిచారణ జరుగుతోంది, సరే, మరి ధరణి పోర్టల్ ద్వారా అక్రమాలు జరిగాయా లేదా, జరిగితే అందుకు బాధ్యులపై చర్యలేవీ .... పౌర సేవల హక్కుల చట్టం తీసుకొస్తామన్నారు, కానీ దాని ఉసే లేదు. పథకాల అమలు కోసం వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు, కానీ అలాంటి కదలికే లేదు.మీరిచ్చిన 420 హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి వేళ్ల మీద లెక్కించదగిన కొన్నింటిపై మాత్రమే మీ సర్కారు దృష్టి సారించింది. ఇంకా లెక్కకు మిక్కిలి హామీల అమలుపై మీ ప్రభుత్వంలో కదలికే లేదు. ఇది ముమ్మాటికీ ప్రజలను దగా చేయడమే. హామీల అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని బిజెపి తీవ్రంగా ఆక్షేపిస్తోందని తెలిపారు. ఈ అలసత్వాన్నివీడి తక్షణమే హామీల అమలుపై అధికారులతో కసరత్తు మొదలెట్టి, వాగ్దానాల అమలును వెంటనే ప్రారంభించాలని, లేదంటే ఏ యే హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి కి రాసిన బహిరంగ లేఖను ఈ సందర్భంగా విడుదల చేశారు.

# కోరుట్ల మున్సిపాలిటీలలో తై బజార్ నిలిపి

**నేషనల్ హాకర్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు షహీద్ మొహమ్మద్ షేక్**

కోరుట్ల, కోరుట్ల మున్సిపాలిటీలో తై బజార్ నిలిపివేయాలని నేషనల్ హాకర్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు షహీద్ మొహమ్మద్ షేక్ డిమాండ్ చేశారు. సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడ లేని విధంగా కోరుట్ల మున్సిపల్ అధికారులు తై బజార్ టెండరు నిర్వహిస్తూ చిరు వ్యాపారుల పొట్ట కొదుతున్నారని ఆరోపించారు... గత ఏప్రిల్ మాసంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ కోర్టు తీర్పు రాకముందే వసూళ్లకు దిగడం బాధాకరమన్నారు.. ఇకనైనా ప్రజాప్రతినిధులు అధికారులు చొరవ తీసుకొని కోర్టు తీర్పు వచ్చేవరకు వసూలు నిలిపివేసి చిరు వ్యాపారులకు ఆదుకోవాలని ఆయన కోరారు.. ఎవరైనా ఒత్తిడి చేస్తే చిరు వ్యాపారస్తులు ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు అబ్దుల్ ముసవ్విర్, సంఘం సభ్యులు మారు హనుమక్క,బాలక్క, అంధే లక్ష్మి,మల్లవ్వ, అలువాల లక్ష్మి, గంగాధర్,ముజీబ్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు

# ఆర్మూర్ బస్టాండ్ లో ఘోర ప్రమాదం

**మహిళ రెండు కాళ్లు పైనుంచి వెళ్లిన ఆర్టీసీ బస్సు**

నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ బస్టాండ్ పరిధిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది నిజామాబాద్ నుండి నిర్మల్ వెళ్తున్న టిఎస్ 18 టి5355 బస్సు ఆర్మూర్ బస్టాండ్ లో గల స్టేజి వద్ద నిలుపగా డ్రైవర్ బస్సులు గమ్యస్థానానికి చేర్చడం కోసం వెనుకకు తీయనిస్తున్న క్రమంలో సుజాత 50 అనే మహిళ అజాగ్రత్తగా బస్సు ఆపమంటూ వెనక నుండి పరిగెత్తుకుంటూ రావడంతో అది గమనించని బస్సు డ్రైవర్ ఆమెను ఢీకొనడంతో బస్సు వెనక చక్రాలు ఆమె రెండు కాళ్లపై నుండి వెళ్లడంతో నుజ్జు నుజ్జు అయ్యాయి సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై అశోక్ అంబులెన్స్ ను పిలిపించి బాధితురాలిని ఆసుపత్రికి తరలించి బస్సు డ్రైవర్ పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

# బీసీల రాజకీయ చైతన్యంతో మారిన పార్లమెంటు ఎన్నికల ఫలితాలు..

**కొనసాగుతున్న సామాజిక మార్పును ప్రధాన పార్టీలు గుర్తెరగాలి..**

**బిజెపి కాంగ్రెస్ తెలంగాణ అధ్యక్షులుగా బీసీలకే అవకాశమివ్వాలి**

**బీసీ రాజ్యాధికార సమితిదాసు సురేష్ ,అధ్యక్షులు**

హైదరాబాద్;తెలంగాణలో మారుతున్న సామాజిక, రాజకీయ పరిణామాలను పార్లమెంటు ఎన్నికల ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని బిసి రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు..

బీసీల ఓటు బ్యాంకు పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు అత్యధిక సీట్లను కేటాయించిన పార్టీకి అగ్ర తాంబూలాన్ని అందించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.. బీసీలలో వస్తున్న రాజకీయ చైతన్యాన్ని రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాన పార్టీలు గమనించాలని కోరారు.. త్వరలో ఎంపిక కాబడనున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్,బిజెపి అధ్యక్ష పదవులను బీసీ నేతలకే కట్టబెట్టాలని ప్రధాన పార్టీలను దాసు సురేశ్ డిమాండ్ చేశారు.. గత ప్రభుత్వంలో నలుగురు బీసీలకు మంత్రులుగా అవకాశాలు రాగా ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటికీ కేవలం రెండు మంత్రి పదవులు మాత్రమే బీసీలకు దక్కయాన్ని,డిప్యూటీ సీఎం అవకాశాన్ని సహితం బీసీలకు కల్పించాలని దాసు సురేష్ తెలంగాణ ప్రభుత్వాన్ని,కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు .. మారుతున్న సామాజిక పరిణామాలను, బీసీలలో ఓటు చైతన్యాన్నిగమనించి గౌరవిస్తేనే భవిష్యత్తులో పార్టీలకు మనుగడ సాధ్యమన్నారు . బీసీల ఆకాంక్షలను అవకాశాలను అభ్యున్నతిని విస్మరిస్తే రాజకీయ పార్టీలకు అధోగతి తప్పదని హెచ్చరించారు..

# 'సెహ్వాగ్ ఎవరు?'.. దిగ్గజ ఆల్‌రౌండర్‌కు తప్పని ట్రోలింగ్



టీ20 వరల్డ్ కప్‌లో బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ షకీబుల్ హసన్ ఫామ్ అందుకున్నాడు. కీలక పోరులో సత్తా చాటిన షకీబ్ అజేయ అర్ధ శతకంతో బంగ్లాను సూపర్- 8కు చేరువ చేశాడు.

నెదర్లాండ్స్ మ్యాచ్ అనంతరం ఈ దిగ్గజ ఆల్‌రౌండర్ సంచలన కామెంట్స్ చేశాడు. భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనను విమర్శించడంపై షకీబ్ స్పందిస్తూ.. అసలు సెహ్వాగ్ ఎవరు చెప్పడానికి?. అతడు క్రికెటర్లకు సలహాలు ఇవ్వకుండా రిటైర్మెంట్ తీసుకోవాలి అని అన్నాడు. అంతే.. చిర్రెత్తుకొచ్చిన వీరూ ఫ్యాన్స్ ఆన్‌లైన్‌లో షకీబ్‌ను తీవ్రంగా ట్రోల్‌ం చేస్తున్నారు. 'నీకు సెహ్వాగ్ ఎవరో తెలియదా?.. బంగ్లాపై వన్డేల్లో డబుల్ సెంచరీ బాదిన వీరుడు' అంటూ వీడియోల మీద వీడియోలు పెడుతున్నారు.

మెగా టోర్నీలో బంగ్లాదేశ్ వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిపోయింది. దక్షిణాఫ్రికాపై గెలవాల్సిన మ్యాచ్‌ను కాస్త 4 పరుగుల తేడాతో అప్పగించేసింది. దాంతో, సుదీర్ఘ అనుభవజ్ఞుడైన అయిన షకీబ్‌పై సెహ్వాగ్ ఓ రేంజ్‌లో విరుచుకుపడ్డాడు. బంగ్లా ఓటమికి షకీబ్ సిగ్గు పడాలని, అతడు వెంటనే టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలకాలని వీరూ అన్నాడు. ఆ మాటల్ని గుర్తు పెట్టుకున్న షకీబ్.. నెదర్లాండ్స్‌పై చెలరేగాడు. 64 పరుగులతో నాటౌట్‌గా నిలిచి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.అనంతరం సెహ్వాగ్ కామెంట్స్‌పై నోరు విప్పిన ఈ ఆల్‌రౌండర్.. 'నా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సెహ్వాగ్‌కు ఇచ్చేస్తాను. అతడిని క్రికెటర్లకు పాఠాలు చెప్పడం నుంచి వీడ్కోలు తీసుకోవాలి' అని గట్టి కౌంటర్ ఇచ్చాడు. అక్కడితో మొదలు టీమిండియ మాజీ డాషింగ్ ఓపెనర్ బంగ్లాపై ఆడిన విధ్వంసక ఇన్నింగ్స్ ఫొటోలతో షకీబ్‌ను ఆడేసుకుంటున్నారు. ప్రపంచ క్రికెట్‌లో విధ్వంసక ఓపెనర్ల జాబితాలో సెహ్వాగ్ ఒకడు. తొలి బంతి నుంచే బౌలర్లకు తన ఉద్దేశాన్ని చాటే వీరూ పవర్ ప్లే కింగ్‌గా.. కనికరమేలేని హిట్టర్‌గా పేరొందిన విషయం తెలిసిందే.

# హెల్మెట్‌లో ఇరుక్కున్న బంతి.. షాక్‌లో బ్యాటర్..



క్రికెట్ ఆట ఎంత సరదగా అనిపిస్తుందో.. అప్పుడప్పుడు అంతే ప్రమాదకరం కూడా. బంతి తలకు తగిలి డగౌట్‌కు వెళ్లిన క్రికెటర్లు.. మైదానంలోనే కుప్పకూలిన ఫిలిప్ హ్యూస్ లాంటి వాళ్లను చూశాం. తాజాగా టీ20 వరల్డ్ కప్‌లో బంగ్లాదేశ్ క్రికెటర్‌కు అచ్చం అలాంటి పరిస్థితే ఎదురైంది. అయితే.. ఓపెన్ తంజిమ్ హసన్ అదృష్టం కొద్దీ పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అసలేం జరిగిందంటే.. ? గురువారం ఉదయం గ్రూప్ డిలో ఉన్న నెదర్లాండ్స్, బంగ్లాదేశ్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నెదర్లాండ్స్ పేసర్ వివియన్ కింగ్మా బౌలింగ్‌లో బంగ్లా ఓపెన్ తంజిమ్‌కు విచిత్ర పరిస్థితి ఎదురైంది.

శ్రీలంక ఎలిమినేట్

బంగ్లాదేశ్ నిర్దేశించిన 160 పరుగుల ఛేదనలో నెదర్లాండ్స్ చేజేతులా ఓడింది. ఒకదశలో 69-3తో పటిష్ట స్థితిలో కనిపించిన ఎడ్వర్డ్స్ బృందం.. టపాటపా వికెట్లు కోల్పోయి 138 రన్స్ కొట్టిందంతే. దాంతో, 25 పరుగుల తేడాతో గెలుపొందిన బంగ్లాదేశ్ సూపర్ 8 బెర్తుకు మరింత చేరువైంది. బంగ్లా ముందడుగు వేయడంతో ఇదే గ్రూప్‌లో ఉన్న మాజీ చాంపియన్ శ్రీలంక టోర్నీ నుంచి ఎలిమినేట్ అయింది.

# పాకిస్థాన్ ఓటమిపై జోకేసిన అమెరికా అధికారి



న్యూయార్క్: టీ20 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ జట్టు అమెరికా చేతిలో ఓడిన విషయం తెలిసిందే. అయితే ఆ ఓటమి గురించి ఆ దేశ ప్రభుత్వ అధికారి మాథ్యూ మిల్లర్‌ను మీడియా సమావేశంలో ఓ జర్నలిస్టు ప్రశ్న వేశారు.

కొత్తగా క్రికెట్ ఆడుతున్న అమెరికా జట్టు మాజీ చాంపియన్లను ఓడించింది, దీనిపై మీ కామెంట్ ఏంటని ఆయన ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు అధికారి స్పందిస్తూ.. బహుశా క్రికెట్ ఆటలో పాకిస్థాన్‌కు అనుభం లేదేమో అని ఆయన అన్నారు. నాకు అనుభవం లేని విషయాల్లో కామెంట్ చేయడం కష్టంగా మారుతుందని, బహుశా పాకిస్థాన్ జట్టు కూడా ఆ దశలో ఉందేమో అని ఆయన పేర్కొన్నారు.

టీ20 వరల్డ్‌కప్‌లో గత వారం అమెరికా జట్టు పాకిస్థాన్‌కు షాక్ ఇచ్చింది. సూపర్ ఓవర్‌లో ఆ జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. నేత్రావల్కర్ ఉత్తమ బౌలింగ్ ప్రదర్శనతో అమెరికాను ఆదుకున్నారు. ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 20 ఓవర్లలో 159 రన్స్ చేసింది. అయితే మ్యాచ్ టై కావడంతో.. సూపర్ ఓవర్‌కు వెళ్లింది. తొలుత సూపర్ ఓవర్‌లో అమెరికా 18 రన్స్ చేయగా, పాకిస్థాన్ కేవలం 13 రన్స్ చేసి ఓడిపోయింది.

అమెరికా చేతిలో పాక్ ఓడడంతో.. ఆ జట్టుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. స్వంత దేశంలో క్రీడాభిమానులు దుమ్మెత్తిపోశారు. ఇక ఆన్‌లైన్‌లో అయితే మీమ్స్‌తో చెలరేగిపోయారు. బాబర్ బృందాన్ని తమ కామెంట్లతో ఆటాడుకున్నారు. ప్రస్తుతం గ్రూప్ ఏలో ఇండియా, అమెరికా జట్లు టాప్‌లో ఉన్నాయి. సూపర్8పై దృష్టి పెట్టాయి. పాక్ తన చివరి మ్యాచ్‌లో ఆదివారం ఐర్లాండ్‌తో తలపడనున్నది.

# సూపర్-8లోకి ఆఫ్ఘనిస్తాన్.. న్యూజిలాండ్ ఔట్



ట్రినిడాడ్: టీ20 వరల్డ్‌కప్‌లో ఆఫ్ఘనిస్తాన్ జట్టు సూపర్-8లోకి ప్రవేశించింది. పపువా న్యూగునియాతో జరిగిన మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో ఆ జట్టు విజయం సాధించింది.

ఆఫ్ఘన్ బౌలర్ ఫజల్లక్ ఫారూకీ అద్భుతమైన బౌలింగ్‌తో పపువ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. గుల్బదిన్ నయిబ్ 49 రన్స్ స్కోర్ చేసి ఆఫ్ఘన్ విక్టరీలో కీలక పాత్ర పోషించాడు. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పపువా న్యూ గునియా కేవలం 95 పరుగులకే ఆలౌటైంది. ఫారూకీ కీలకమైన మూడు వికెట్లు తీసుకున్నాడు. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆఫ్ఘన్ జట్టు 15 ఓవర్లలోనే టార్గెట్‌ను అందుకున్నది. ఆఫ్ఘనిస్తాన్ విక్టరీతో గ్రూప్ సి నుంచి న్యూజిలాండ్ జట్టు నాకౌట్ అయ్యింది. అయితే ఈ గ్రూపు నుంచి ఇప్పటికే వెస్టిండీస్ జట్టు సూపర్ 8లోకి ప్రవేశించింది. ఆఫ్ఘనిస్తాన్ కూడా ఆరు పాయింట్లతో సూపర్-8 స్టేజ్‌ను కన్ఫర్మ్ చేసుకున్నది. ఈ గ్రూపులో రెండు మ్యాచ్‌లు ఆడిన న్యూజిలాండ్ రెండింటిలో ఓడిపోయి ఇక పాయింట్ల ఖాతా తెరవలేదు. ఒకవేళ తర్వాత రెండు మ్యాచుల్లో కివీస్ నెగ్గినా.. ఆ జట్టుకు సూపర్ 8 వెళ్లే ఛాన్సు లేదు.

# పాపం న్యూజిలాండ్.. పదేళ్ల తర్వాత తొలిసారి..!

టీ20 వరల్డ్‌కప్ 2024లో న్యూజిలాండ్ మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. వరల్డ్‌కప్ టోర్నీల్లో (వన్డే/టీ20) సెమీస్ లేదా ఫైనల్‌కు చేరకుండా నిష్క్రమించడం ఆ జట్టుకు పదేళ్లలో ఇది తొలిసారి. 2014 టీ20 వరల్డ్‌కప్‌లో చివరిసారి సెమీస్ లేదా ఫైనల్స్‌కు చేరకుండా (రౌండ్ 2) ప్రపంచకప్ టోర్నీల నుంచి నిష్క్రమించిన న్యూజిలాండ్.. 2015 నుంచి వరుసగా ఆరు సార్లు సెమీస్ లేదా ఫైనల్స్‌కు చేరుకుంటూ వచ్చింది. 2015 వన్డే వరల్డ్‌కప్‌లో ఫైనల్స్‌కు చేరిన న్యూజిలాండ్.. ఆ తర్వాత 2016 టీ20 వరల్డ్‌కప్‌లో సెమీస్‌కు, 2019 వన్డే వరల్డ్‌కప్‌లో ఫైనల్స్‌కు, 2021 టీ20 వరల్డ్‌కప్‌లో ఫైనల్స్‌కు, 2022 టీ20 వరల్డ్‌కప్‌లో సెమీస్‌కు, 2023 వన్డే వరల్డ్‌కప్‌లో సెమీస్‌కు చేరింది. ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో ఆఫ్ఘనిస్తాన్, వెస్టిండీస్ చేతుల్లో అనూహ్య పరాజయాలు ఎదుర్కొన్న న్యూజిలాండ్ ఊహించని రీతిలో టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వస్తుంది. ఈ టోర్నీ హాట్ ఫేవరెట్లలో ఒకటైన న్యూజిలాండ్ అవమానకర రీతిలో టోర్నీ నుంచి వైదొలగడంతో ఆ జట్టు అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ టోర్నీలో న్యూజిలాండ్ తరహాలోనే శ్రీలంక కూడా సూపర్-8కు చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరో పెద్ద జట్టు పాకిస్తాన్ ఈ రెండు జట్ల సరసన చేరేందుకు సిద్ధంగా ఉంది.

టెస్ట్ ప్లేయింగ్ దేశాలైన న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్తాన్ కనీసం సూపర్-8కు కూడా చేరకుండానే నిష్క్రమిస్తుండటంతో ఆయా దేశాలకు చెందిన అభిమానులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, యూఎస్ఏ, స్కాట్లాండ్ లాంటి చిన్న జట్లు ఈ టోర్నీలో సంచలనాలు నమోదు చేస్తున్నాయి.

పై పేర్కొన్న జట్లలో అనుభవ పరంగా అన్నింటి కంటే చిన్న జట్టైన యూఎస్ఏ ఓసారి ప్రపంచ ఛాంపియన్ అయిన పాక్‌కు షాకిచ్చిప పెను సంచనలం సృష్టించింది. నేడు (జూన్ 14) ఐర్లాండ్‌తో యూఎస్ఏ తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో ఆ జట్టు గెలిచినా లేక వర్షం కారణంగా ఈ మ్యాచ్ రద్దైనా యూఎస్ఏ సూపర్-8కు, పాక్ ఇంటికి చేరతాయి.

# సూపర్ 8 చేరిన 5 జట్లు.. 3 స్థానాల కోసం 6 టీంల పోరు.. టీ20 ప్రపంచకప్ నుంచి 6 జట్లు ఔట్..



టీ20 ప్రపంచ కప్ 2024 లో సూపర్-8కి వెళ్లే యుద్ధం రసవత్తరంగా మారింది. ఇప్పటివరకు, సూపర్-8లో మొత్తం ఐదు జట్లు తమ స్థానాలను నిర్ధారించుకున్నాయి. రెండు పెద్ద జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయి. కాగా, మిగిలిన మూడు స్థానాల కోసం చాలా పెద్ద జట్ల మధ్య పోటీ నెలకొంది. డెత్ గ్రూప్‌గా పరిగణించే గ్రూప్ డి పరిస్థితి చాలా ఆసక్తికరంగా మారింది.

సూపర్-8కి అర్హత సాధించిన జట్లు..

ఇప్పటివరకు మొత్తం 5 జట్లు సూపర్-8కి అర్హత సాధించాయి. టీమ్ ఇండియా గ్రూప్-ఏలో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. భారత జట్టు వరుసగా ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి సూపర్-8కి అర్హత సాధించింది. గ్రూప్-బి నుంచి ఆస్ట్రేలియా జట్టు సూపర్-8కి దూసుకెళ్లింది. ఆ జట్టు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచింది. గ్రూప్ సి నుంచి వెస్టిండీస్, ఆఫ్ఘనిస్థాన్‌లు తదుపరి రౌండ్‌లోకి ప్రవేశించాయి. పపువా న్యూ గినియాపై విజయం సాధించి ఆఫ్ఘనిస్తాన్ సూపర్-8కి అర్హత సాధించింది. కాగా, గ్రూప్-డి నుంచి దక్షిణాఫ్రికా సూపర్-8కి అర్హత సాధించింది.

టీ20 ప్రపంచకప్‌లో ముగిసిన 6 జట్ల ప్రయాణం..

ఇప్పటి వరకు 2024 టీ20 ప్రపంచకప్‌లో మొత్తం 6 జట్లు నిష్క్రమించాయి. గ్రూప్ ఏ నుంచి అధికారికంగా ఏ జట్టు అనర్హత లిస్టులో చేరలేదు. కానీ, మిగిలిన మూడు గ్రూపుల నుంచి 6 జట్లు నిష్క్రమించాయి. గ్రూప్ బి నుంచి నమీబియా, ఒమన్ జట్లు నిష్క్రమించాయి. ఉగాండా, పపువా న్యూ గినియా, న్యూజిలాండ్‌లు గ్రూప్ సి నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. కివీస్ జట్టుకు ఇది పెద్ద దెబ్బగా మారింది. ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. ఆఫ్ఘనిస్తాన్ విజయంతో పపువా న్యూ గినియా ప్రయాణం %o%20 ప్రపంచ కప్‌లో ముగిసింది. గ్రూప్ డి నుంచి శ్రీలంక నిష్క్రమించింది.

మిగిలిన 3 స్థానాల కోసం ఈ జట్ల మధ్య పోరు..

సూపర్-8లో చోటు దక్కించుకోవడానికి ప్రస్తుతం మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇందుకోసం అమెరికా,పాకిస్థాన్, ఇంగ్లండ్, స్కాట్లాండ్,నెదర్లాండ్స్, బంగ్లాదేశ్ వంటి జట్లు రేసులో ఉన్నాయి. గ్రూప్ డిలో బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, నేపాల్ మధ్య పోరు సాగుతోంది. ఈ జట్లలో ఎవరైనాముందుకు వెళ్లవచ్చు. అయితే, బంగ్లాదేశ్‌కు 3 మ్యాచ్‌ల్లో 4 పాయింట్లు ఉన్నందున అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నెదర్లాండ్స్‌కు రెండు పాయింట్లు, నేపాల్‌కు 1 పాయింట్లు మాత్రమే ఉన్నాయి.

# పాకిస్థాన్ కు మూడు గండాలు.. అది దాటితేనే సూపర్ 8కు ఛాన్స్




టీ 20 వరల్డ్ కప్ లో పాకిస్థాన్ కు టెన్షన్ పట్టుకుంది. ఈరోజు రాత్రి వర్షం పడకుండా బాబర్ సేన ప్రార్థనలు చేస్తుంది. వర్షం పడి ఆట ఆగిపోతే మాత్రం పాకిస్థాన్ సూపర్ 8కు చేరుకోలేదు. ప్రపంచ కప్ నుంచి వైదొలగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రాత్రి 8 గంటలకు అమెరికా ఐర్లాండ్ తో తలపడుతుంది. ఈ మ్యాచ్ వర్షార్పణం అయితే పాకిస్థాన్ ఇంటికి వెళ్లక తప్పదు. ఎందుకంటే ఇప్పటికే నాలుగు పాయింట్లతో అమెరికా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. వర్షం వల్ల మ్యాచ్ ఆగితే మరొక పాయింట్ చేరి ఐదుకు చేరుతుంది. అయినా..అమెరికా ఐర్లాండ్ మీద గెలిచినా సరే పాక్ ఇక ప్రపంచకప్ నుంచి నిష్క్రమించాల్సిందే.

వర్షం పడి...

అంటే మ్యాచ్ జరిగి అమెరికా ఐర్లాండ్ మీద గెలిచినా, వర్షం పడి మ్యాచ్ ఆగిపోయినా పాకిస్థాన్ కు గండమే. అందుకే ఈరోజు రాత్రికి బాబర్ సేన భవితవ్యం తేలనుంది. జూన్ 16వ తేదీన తన ఎ గ్రూపులో చివరి మ్యాచ్ ను ఐర్లాండ్ తో ఆడాల్సి ఉంది. ఇప్పటికి పాకిస్థాన్ రెండు మ్యాచ్ లలో ఓడి ఒక మ్యాచ్ లో అది కెనడాతో గెలిచింది. అంటే రెండు పాయింట్లతో ఉంది. చివరి మ్యాచ్ గెలిచినా నాలుగు పాయింట్లకే పరిమితమవుతుంది. అమెరికా సూపర్ 8కు చేరుకుంటుంది. అంతే తప్ప పాకిస్థాన్ ఇక సూపర్ 8 కు చేరే ఛాన్స్ లేదు.

రాత్రి పది గంటలకు... పాకిస్థాన్ ఇప్పుడు మూడు రకాల కోరికలతో ప్రార్థన చేయాల్సి ఉంది. ఒకటి .. ఈరోజు వర్షం పడకుండా మ్యాచ్ కొనసాగాలని కోరుకోవడం. మరొకటి ఈ మ్యాచ్ లో అమెరికా ఐర్లాండ్ చేతిలో ఓటమి పాలు కావడం, మూడోది అలాగే ఆరోజు వర్షం పడకూడదని.. ఇలా.. ఈ నాలుగు కోర్కెలు తీరితేనే పాకిస్థాన్ సూపర్ 8కు అర్హత సాధిస్తుంది. మూడింటిలో ఏ ఒక్కటీ జరగకపోయినా పాకిస్థాన్ ఇంటి దారి పట్టాల్సిందే. ఈరోజు అమెరికా - ఐర్లాండ్ మ్యాచ్ లో అమెరికా గెలిస్తే ఈరోజు పాక్ భవతవ్యం తేలిపోతుంది. ఫ్లోరిడాలో వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ చెప్పడంతో పాక్ జట్టు గుప్పిట భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతుంది. మరి రాత్రి పది గంటలకు కానీ పాక్ భవితవ్యం తేలనుంది.

# గ్రూపులో గర్జించిన కూనలు.. గణాంకాల్లో చిరు జట్లదే హవా..!



ఇంటర్నెట్‌డెస్క్: అవగాహన ఉన్న.. గతంలో ఆడిన పిచ్‌లపై చెలరేగిపోవడం సీనియర్ జట్లకు అలవాటుగా మారింది. కొత్త పిచ్‌లపై మాత్రం అవి కూడా కూలబడిపోతుండగా..

నూతనంగా అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన జట్లు మాత్రం తమ సత్తా చాటుతున్నాయి. ప్రతి గ్రూపులో ఒక బడా జట్టు సూపర్-8కు చేరకుండానే ఇంటికిపోయే పరిస్థితి నెలకొంది. గణాంకాల్లో కూడా నూతన జట్ల ఆటగాళ్లే పూర్తి ఆధిపత్యం చూపిస్తున్నారు. భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వంటి అగ్రశ్రేణి జట్ల ఆటగాళ్లు చాలా విభాగాల్లో టాప్-5లో కూడా లేరంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. అంటే ఈ టోర్నీ ఎంత ఉత్కంఠగా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు.

ప్రతి గ్రూపులో ఓ బడా జట్టుకు గండమే..

గ్రూప్-ఎలో పాకిస్థాన్ జట్టు పరిస్థితి దయనీయంగా మారింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు ఓడిపోయింది. అది సూపర్-8కు చేరాలంటే ఇప్పుడు ఫ్లోరిడాలో జరగనున్న యూఎస్ఏ-ఐర్లాండ్ మ్యాచ్ ఫలితంపై ఆధారపడింది. పాకిస్థాన్ 2009లో పొట్టికప్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ గ్రూపులో అమెరికా పరిస్థితి మెరుగ్గా కనిపిస్తోంది.

గ్రూప్-బిలో ఇంగ్లాండ్ పరిస్థితి కూడా ఓ పట్టాన తేలేట్లు లేదు. తర్వాత మ్యాచ్‌ల్లో స్కాట్లాండ్ ఓడిపోయి.. నమీబియాపై ఇంగ్లాండ్ గెలిస్తే అవకాశం ఉంటుంది. గతంలో రెండుసార్లు పొట్టికప్ అందుకొన్న ఈ జట్టు పరిస్థితి త్రిశంకుస్వర్గంలో వేలాడుతోంది. ఈ గ్రూపులో చిన్నజట్టు అయిన స్కాట్లాండ్ రెండో స్థానంలో ఉంది.

గ్రూప్-సిలో ఆసియా పసికూన అఫ్గానిస్థాన్ అన్ని మ్యాచ్‌ల్లో విజయం సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత ప్లేస్‌లో వెస్టిండీస్ ఉంది. ఈ గ్రూపులో న్యూజిలాండ్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయి అట్టడుగు స్థానంతో సరిపెట్టుకొంది. దీనికంటే ఉగాండ, పాపువా న్యూగినీ జట్లు మెరుగైన స్థితిలో కొనసాగుతున్నాయి.

గ్రూప్-డిలో దక్షిణాఫ్రికా అగ్రస్థానంలో ఉండగా.. ఆ తర్వాత బంగ్లాదేశ్ నిలిచింది. మూడు మ్యాచ్‌ల్లో 1 పాయింట్‌తో శ్రీలంక అట్టడుగుకు చేరింది. నెదర్లాండ్స్, నేపాల్ దీనికంటే మెరుగైన స్థితిలో ఉన్నాయి. శ్రీలంక కూడా గతంలో ఒక సారి టీ20 ప్రపంచకప్‌ను గెలిచిన జట్టే.

సూపర్ స్టార్లు ఎక్కడా..?

వ్యక్తిగత గణాంకాల్లో అఫ్గాన్, అమెరికన్ ఆటగాళ్లదే హవా కనిపిస్తోంది. గత వన్డే ప్రపంచకప్‌లో వ్యక్తిగత గణాంకాల్లో టీమ్ ఇండియా క్రీడాకారుల హవా స్పష్టంగా కనిపించింది. కానీ, ఈ టోర్నీలో ఇప్పటివరకు అటువంటిది ఏమీ లేకపోవడం గమనార్హం.

అత్యధిక పరుగుల్లో అఫ్గానిస్థాన్‌కు చెందిన గుర్బాజ్ (167) తొలి స్థానంలో ఉన్నాడు. టాప్-5లో భారత ఆటగాళ్లు లేరు.

అత్యధిక వికెట్ల జాబితాలో అఫ్గాన్‌కు చెందిన ఫారూఖీ (12) ఫస్ట్ ప్లేస్‌లో ఉన్నాడు. కానీ, ఇక్కడ ఒక్క అర్ష్‌దీప్ సింగ్ (7) మాత్రమే జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు.

ఒక మ్యాచ్‌లో అత్యధిక పరుగులు సాధించినవారి జాబితాలో అమెరికా ఆటగాడు ఆరోన్ జోన్స్ (94) మొదటి ప్లేస్‌లో ఉన్నాడు. ఈ లిస్ట్‌లో భారత ఆటగాళ్లు టాప్-5లో లేరు. అఫ్గాన్‌కు చెందిన ముగ్గురు ఆటగాళ్లు ఉన్నారు.

ఒక మ్యాచ్‌లో బెస్ట్ బౌలింగ్‌లో అఫ్గానిస్థాన్‌కు చెందిన ఫరూఖీ (5/9) అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ విభాగంలో అర్షదీప్‌సింగ్ నాలుగో స్థానంలో నిలిచాడు. ఇప్పటివరకు టోర్నీలో అత్యుత్తమ బౌలింగ్ సగటు కూడా ఫరూఖీదే.

ఇక టాప్ అర్ధ శతకాల్లో అఫ్గాన్‌కు చెందిన గుర్బాజ్ (2) తొలిస్థానం దక్కించుకొన్నాడు. మరో 12 మంది ఆటగాళ్లతో కలిసి రోహిత్, సూర్య సంయుక్తంగా రెండో స్థానంలో కొనసాగుతున్నారు.

పొదుపైన బౌలర్ల జాబితాలోని టాప్-5లో ముగ్గురు అఫ్గాన్ బౌలర్లే ఉండటం విశేషం. దీనిలో నవీనుల్ హక్ (2.29) తొలిస్థానంలో నిలవడం విశేషం.

అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాళ్లలో అమెరికాకు చెందిన ఆరోన్ జోన్స్ (13) ఫస్ట్ ప్లేస్‌లో ఉండగా.. ఆ తర్వాత స్థానంలో గుర్బాజ్ (10) నిలిచాడు. ఇక ఫోర్ల జాబితాలో తొలి స్థానం కెనడా ఆటగాడు ఆరోన్ జాన్సన్ (12) కొనసాగుతున్నాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**